
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 సంచిక : 99 హైదరాబాద్ శుక్రవారం 22 -12 - 2023 పేజీలు : 8 రూ.4






- అధికార సభ్యులతో పాటు సిఎం వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చిన మాజీ మంత్రులు

### అధికారపక్షం చేసిన ఆరోపణలపై

# కెటిఆర్, హరీశ్ రావుల ఆగ్రహం

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** విద్యుత్ శాఖపై గురువారం అసెంబ్లీ జరిగిన స్వల్పకాలిక చర్చలో మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావులు అధికారపక్షం చేసిన ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార సభ్యులతో పాటు సిఎం చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీ ప్రజలు కరెంట్ బిల్లులు కట్టలేదు. ఇక బిఆర్ఎస్ కాంగ్రెస్, టిడిపి, ఎంఐఎంతో పొత్తు పెట్టుకుందని రేవంత్ వ్యాఖ్యానించారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సిద్దిపేట, గజ్వేల్, ఓల్ట్ సిటీ ప్రజల మీద సిఎం రేవంత్ అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేశారని హరీశ్ రావు ఆరోపించారు. సిద్దిపేటలో, గజ్వేల్, ఓల్ట్ సిటీలో కాంగ్రెస్ గెలవలేదన్న బాధలో రేవంత్ ఉన్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అక్కడ గెలవలేదన్న బాధతోనే అక్కడి ప్రజలు బిల్లులు కట్టలేదని పేర్కొనడం వాస్తవం కాదని హరీశ్ రావు పేర్కొన్నారు. అక్కడ ఏదన్నా ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉందో, ఒక ఇండస్ట్రీయలిస్ట్ ఎవరన్నా కట్టకపోతే, ఆ బిల్లులు వసూలు చేయండి తప్ప తమ నియోజకవర్గ ప్రజలను బద్నాం చేయడం సబబుకాదని సిఎంకు ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు.

**తెలంగాణ సాధన కోసమే నాడు పొత్తులు**

బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, టిడిపితో, ఎంఐఎంతో పొత్తు పెట్టుకుందని రేవంత్ వ్యాఖ్యానించారు. అవును మేం పొత్తు పెట్టుకున్నాం. నిజంగా టిఆర్ఎస్ పార్టీ 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని, తెలంగాణ ఇస్తామని కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెట్టి, రాష్ట్రపతి నోట చెప్పి మీరు మోసం చేశారు కాబట్టే ఆ రోజు టిడిపితో పొత్తు పెట్టుకున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. మేం టిడిపితో, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నా ఎవరితో పొత్తు పెట్టుకున్నా ఈ రాష్ట్ర, దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి తెలంగాణ సాధించామని హరీశ్ రావు పేర్కొన్నారు. తమ ప్రయత్నం వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, ఇవాళ మేం సక్సెస్ అయ్యామని, రాష్ట్రాన్ని సాధించాలన్న వ్యూహంలో భాగంగానే పొత్తులు పెట్టుకున్నామని హరీశ్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి ఆయన

వివరాలు 2లో

### సాగునీటి రంగంపై

# సమగ్ర నివేదిక ఇవ్వండి

- అధికారులకు సిఎం ఆదేశాలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** సాగు నీటి రంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ముఖ్యమంత్రి తన నివాసంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. 1956 నుంచి 2014 వరకు, 2014 నుంచి 2023 వరకు నిర్మించిన ప్రాజెక్టులు, వాటి నిర్మాణ వ్యయాలు, ప్రాజెక్టుల వారీగా సాగులోకి తెచ్చిన ఆయకట్టు వివరాలను అధికారుల ద్వారా సీఎం తెలుసుకున్నారు.ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రజలకు తెలియజేసేలా చూడాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని రకాల లెక్కలు పూర్తిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయొద్దని ఒక వేళ అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వంలో ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనన్న ఉద్దేశంతో ప్రతి అంశాన్ని ప్రజలకు విడమరచి చెబుతున్నామన్నారు. ఈ విషయంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి నిజాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి,రఘునందన్ రావు, శేషాద్రి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచి స్వాగతిస్తాం

- ఆటా సిఐఐ బిజినెస్ సెమినార్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు అన్నివిధాల సహకరిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ టీ హబ్ లో ఆటా వేడుకల్లో భాగంగా గురువారం ఆటా సిఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ సెమినార్ కార్యక్రమానికి హైదరాబాద్ ఎంబసీ యు.ఎస్ కాన్సోల్ జనరల్ మిస్ జెన్నిఫర్ లార్సన్ తో కలిసి మంత్రి ఉత్తమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచి తెలంగాణ ప్రభుత్వం స్వాగతం పలుకుతుంది అని అన్నారు. అలాగే వారికి ఏ సమస్యలున్నా తీర్చే బాధ్యత మాదేనని అన్నారు.ఆటతో తనకు మంచి అనుబంధం వుందని, మంచి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆటా, సిఐఐ వాళ్ళను అభినందిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన హైదరాబాద్ ఎంబసీ యు.ఎస్ కాన్సోల్ జనరల్ మిస్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ అమెరికాలో తెలుగు వారు ఎక్కువగా వున్నారని, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటా కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందని అన్నారు. అలాగే అమెరికా లో తెలుగు వారు చాలా ఉన్నతంగా ఎదిగారని అన్నారు. హైదరాబాద్, అమెరికా మధ్య సంధానకర్తగా ఆటా వ్యవహరించడం అభినందనీయం అన్నారు. హైదరాబాద్ కు అమెరికా నుండి పెట్టుబడులు రావడానికి తన వంతు కృషి చేస్తాం అన్నారు.ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని మాట్లాడుతూ ఆటా వేడుకల్లో భాగంగా ఈ బిజినెస్ సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సెమినార్ తెలంగాణ, అమెరికా మధ్య సంబంధాలు మరింత పెంపొందించడానికి ఉపయోగపడతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 జూన్ 7,8,9 లలో నిర్వహించే ఆటా మహాసభలకు అతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని రమ్మని ఆహ్వానించారు. సిఐఐ అధ్యక్షులు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.ఆటా వారితో ఈ సెమినార్‌ని సంయుక్తంగా చేయడం తమకు ఆనందంగా వుందన్నారు. ఈ అనుబంధం మరింత పెంపోందాలని ఆకాంక్షిం చారు. ఆటా వేడుకల చైర్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా మాట్లాడుతూ పెట్టుబడి పెట్టడానికి వచ్చే కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటా వేడుకల కో చైర్ వేణు సంకినేని, ఆటా సెక్రెటరీ రామకృష్ణారెడ్డి అల, ఆటా కోశాధికారి సతీష్ రెడ్డి, ఆటా కన్వెన్షన్ కన్వీనర్ కిరణ్ రెడ్డి పాశం,18వ ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కో ఆర్డినేటర్ సాయి సుధిని, ఆటా జాయింట్ సెక్రెటరీ రవీందర్ గూడూరు, బిజినెస్ కో చైర్ రామ్ మట్టపల్లి, లక్ష్ చేపురి,హరీశ్ బత్తిని, మీడియా కో ఆర్డినేటర్ ఈశ్వర్ బండా, పాస్ట్ ప్రెసిడెంట్ పరమేష్ భీమ్ రెడ్డి, ఆటా బోర్డు ఆఫ్ ట్రస్టీస్ నరసింహారెడ్డి ద్యాసాని, కిషోర్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో మరో రెండు కరోనా కేసులు..



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కరోనా మళ్లీ పడగ విప్పుతోందా? ఈ ప్రశ్నకు అవుననేదే సమాధానంగా కనబడుతోంది. కరోనా కొత్త వేరియంట్ జేఎన్1నిశ్శబ్దంగా విస్తరిస్తున్నట్లుగా అధికార యంత్రాంగం అనుమానిస్తోంది. నిన్నటివరకూ హైదరాబాద్ లో ఆరు కేసులు వెలుగు చూశాయి. తాజాగా గురువారం మరో రెండు కేసులు బయటపడ్డాయి. ఫీవర్ ఆస్పత్రిలో సేకరించిన నమూనాల్లో ఇద్దరికి కరోనా వైరస్ సోకినట్లు వైద్యాధికారులు అనుమానిస్తున్నారు. జినోమ్ సీక్వెన్స్ కోసం ఈ నమూనాలను పుణెకు పంపించారు.కరోనా కొత్త వేరియంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, పదేళ్లలోపు పిల్లలు, మహిళలు, వృద్ధులు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

### సింగరేణి ఎన్నికల్లో

# టిబిజికెఎస్‌కు షాక్

**పదవులకు రాజీనామా చేసిన యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** 27న జరగనున్న సింగరేణి ఎన్నికల్లో పోటీ చేయకూడదని యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిర్ణయం తీసుకోవడంతో ఆమె నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టిబిజికెఎస్) అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరావు , మిర్యాల రాజారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్యలు తమ పదవులకు గురువారం రాజీనామా చేశారు. మీరు తీసుకున్న నిర్ణయంతో కార్మికులకు , కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఒక లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కాలం తమకు సహకరించినందుకు వారు కృతజతలు తెలుపుతూ వెంటనే తమ రాజీనామాలను ఆమోదించాలని ఈ సందర్భంగా వారు కవితకు విజ్ఞప్తి చేశారు.

### తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా

- మొత్తం ఆరురోజులు... 26 గంటల 33 నిమిషాల పాటు సమావేశాలు

- సభలో ప్రసంగించిన 19 మంది ఎమ్మెల్యేలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. డిసెంబర్ 09వ తేదీన ప్రారంభమైన శాసన సభా సమావేశాలు మొత్తం ఆరు రోజుల పాటు కొనసాగాయి. ఈ ఆరు రోజుల్లో 26 గంటల 33 నిమిషాల పాటు సమావేశాలు కొనసాగినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.ఈ సభలో 19 మంది ఎమ్మెల్యేలు ప్రసంగించగా ఈ సభలో రెండు అంశాలపై స్వల్పకాలిక చర్చలు జరిగాయి. డిసెంబర్ 21వ తేదీ నాటికి నాటికి సభలో కాంగ్రెస్ 64 మంది, బిఆర్ఎస్ 39 మంది, బిజెపి 8 మంది, ఎంఐఎం 7, సిపిఐ ఒక ఎమ్మెల్యే ఉన్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి సమావేశం ఇది. డిసెంబర్ 9న ప్రారంభమైన ఈ అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రభుత్వం పనితీరు, ఖర్చులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసింది.



### మ్యానిఫెస్టో అమలుకు ఆర్థిక అంశాలు ప్రజల ముందు పెట్టాం: మంత్రి శ్రీ ధర్ బాబు




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ప్రజలకు పూర్తిగా అందించాలనే ఉద్దేశంతో ఆర్థిక అంశాలు ప్రజల ముందు పెట్టినట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు చెప్పారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ గత 10ఏళ్ళ బిఆర్ఎస్ పాలనపై అసెంబ్లీ లో శ్వేత పత్రం విడుదల చేశామని, రాష్ట్రంలో ప్రతి యువకుడిపై రూ. 7 లక్షల అప్పును గత ప్రభుత్వం మోపిందన్నారు. కాంగ్రెస్ ఆనాడు అభివృద్ధి అడుగులు వేసినట్లు తరువాత ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముందు చూపు లేకపోతే రోజుకు 12 గంటల కరెంట్ సరఫరా అయ్యేది కాదన్నారు. గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా విధానం ఎలా ఉంది అంటే ప్రతిపక్ష సభ్యులు తెల్లమొహం

వివరాలు 2లో

## మ్యానిఫెస్టో అమలుకు ఆర్థిక అంశాలు ప్రజల ముందు పెట్టాం: మంత్రి శ్రీధర్ బాబు

(మొదటి పేజీ తరువాయి)

వేసుకోని కూర్చున్నారని ఎద్దేవా చేశారు. మూడు ఎకరాల భూమి పంపిణీ, ఎస్సీ , ఎస్టీలకు నిధుల కేటాయింపులపై సమాధానం చెప్పలేక పోయారని పేర్కొన్నారు. అసెంబ్లీలో పెట్టిన ప్రతి లెక్క వాస్తవమని, కావాలంటే స్పీకర్ ఆదేశంతో ప్రతి సభ్యుడికి అందిస్తామని, శ్వేత పత్రం లెక్కలు ఎవరిని కించపరచడానికి సభలో ప్రవేశపెట్టలేదన్నారు. రాష్ట్ర ప్రజలు ఎవరు అనుమానపడవద్దని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, వ్యవసాయం, పరిశ్రమలు, డోమెస్టిక్ వినియోగ దారులకు పూర్తి స్థాయిలో కరెంట్ ఇస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య దృకృథంతో లెక్కలు ప్రజల ముందు పెట్టినట్లు వెల్లడించారు. మా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని, గత ప్రభుత్వం పాలనలో తప్పులు జరిగాయని విమర్శించారు.

## ప్రేమ విఫలం.. ఐటి ఉద్యోగి ఆత్మహత్య



**తెలంగాణ వీణ/గచ్చిబౌలి:** ప్రేమ విఫలమై ఐటీ ఉద్యోగి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా బాతులూరు గ్రామానికి చెందిన గజ్జ నాగశేషులు వ్యవసాయం చెలుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆతని కుమారుడు గజ్జ నాగచక్రపాణి (28) గచ్చి బౌలిలోని సాన్విక మేన్స్ పీజీ హాస్టల్‌లో నివాసముంటు ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా డిసెంబర్ 20వ తేదీన నాగ చక్రపాణి తను ఉంటున్న హాస్టల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్ షీట్ తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.అది గమనించిన రూమ్ మేట్స్ పోలీసులకు, అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. ప్రేమ విఫలం కావడంతోనే మనస్థాపానికి గురై నాగచక్రపాణి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తబ్లిగీ జమాత్ సంస్థను ప్రోత్సహిస్తే ఉగ్రవాదం పెంచినట్లే : రాజాసింగ్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెలలో వికారాబాద్‌లో జరగనున్న తబ్లిగీ జమాత్ సమావేశాలకు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయడంపై బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కజికిస్తాన్, రష్యా, సౌదీ అరేబియా సహా అనేక దేశాలలో ఈ సంస్థపై నిషేధం కొనసాగుతోందని అటువంటి తబ్లిగీ జమాత్‌కు ప్రభుత్వం ఎందుకు నిధులు విడుదల చేసిందని ప్రశ్నించారు.తీవ్రవాద సిద్ధాంతం కలిగిన సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతోందని విమర్శించారు. గురువారం రాజాసింగ్ ఓ వీడియో విడుదల చేశారు. ఏం ఆశించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చూస్తున్నారో సిఎం చెప్పాలన్నారు. తబ్లిగీ జమాత్ చరిత్ర మీకు తెలియదా అని నిలదీశారు. గతంలో బైంసాలో జరిగిన సదస్సులో సందర్భంగా హింస చెలరేగిందని, తబ్లిగీ జమాత్ సంస్థకు ప్రోత్సహిస్తే ఉగ్రవాదాన్ని పెంచినట్లు అవుతుందని మండిపడ్డారు.

## కాపాడుదామని పోతే ప్రాణం పోయే..

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాలా సమీపంలో జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని కల్వకుర్తికి చెందిన నవాజ్(25), కొత్తకోట మండలం కన్వేట గ్రామానికి చెందిన అశోక్(30) అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..కల్వకుర్తికి చెందిన నవాజ్ అనే యువకుడు జడ్చర్ల నుండి కల్వకుర్తి బయలుదేరాడు. మార్గం మధ్యలో మార్చాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి.ౕరోదిస్తున్న నవాజ్ ను చూసి మిర్యాలగూడ నుండి కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికీ చెందిన బోలోరో వాహనంలో వెళుతున్న అశోక్ నవాజ్ కు సహాయం చేద్దామని దగ్గరికి వెళ్ళగానే మరో గుర్తు తెలియని వాహనం ఇద్దరిని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అధికారపక్షం చేసిన ఆరోపణలపై

## కెటిఆర్, హరీశ్ రావుల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగతంగా పదవుల కోసం పార్టీలు మారారనని, మేం అలా చేయలేదని, మేం ఇతర రాజకీయ పార్టీలతో తెలంగాణ కోసం మాత్రమే పొత్తు పెట్టుకున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేను సిఎం రేవంత్ అవమానపరిచారని, విజ్ఞులైన ప్రజలు మా అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారని హరీశ్ రావు పేర్కొన్నారు.

**కడపలో రాయలసీమ థర్మల్ పవర్ కేంద్రం ఎందుకు పెట్టారు ?**

తెలంగాణలో విద్యుత్ కష్టాలకు కాంగ్రెస్ పార్టీనే కారణం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. నీళ్లు, బొగ్గు లేని రాయలసీమలో, బొగ్గు లేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రాలు నెలకొల్పుతారన్నారు. తెలంగాణలో ఆ రోజు విద్యుత్ కేంద్రాలు కట్టకుండా, రాష్ట్రం ఏర్పడే నాటికి 27 వందల మెగావాట్ల లోటు నష్టాలతో తమకు అప్పజెప్పారని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్ర, నిర్వాకాన్ని వైట్ పేపర్‌లో చాలా గొప్పగా స్పష్టంగా చెప్పిందన్నారు. తమకు ప్రజలు 11 సార్లు అవకాశం ఇస్తే 2014 నాటికి ఆరు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చామని, అంతటి అసమర్థత, చేతకానితనం మాది అని వారే ఒప్పుకున్నారని కెటిఆర్ తెలిపారు. కడపలో రాయలసీమ థర్మల్ పవర్ కేంద్రం ఎందుకు పెట్టారు ? అక్కడ బొగ్గు ఉందా..? నీళ్లు ఉన్నాయా..? విజయవాడలో బొగ్గు ఉందా..? ఇవాళ బాగా మాట్లాడుతున్నారు. తెలంగాణలో విద్యుత్ కేంద్రాలు కట్టకుండా, రాష్ట్రం ఏర్పడే నాటికి 27 వందల మెగా వాట్ల లోటు నష్టాలతో తమకు అప్పజెప్పారని కెటిఆర్ పేర్కొన్నారు.

**తెలంగాణ బిడ్డలుగా గట్టిగా కొట్లాడినం..**

మానకొండూరు నియోజకవర్గంలోని నేదునూరు, చేవెళ్ల నియోజకవర్గం లోని శంకర్‌పల్లిలో ఆనాడు యూపిఏ ప్రభుత్వం గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు నెలకొల్పుతామని భూసేకరణ చేసిందని కెటిఆర్ ఆరోపించారు. టిఆర్ఎస్ పార్టీగా ఆనాడు ఒక్క దగ్గర ధర్నా చేయదని, ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ధర్నా చేయలేదని, కేంద్రం నిర్ణయం తీసుకున్న గ్యాస్ ఆధారిత కేంద్రాలు ఎందుకు పెట్టడం లేదని నిరసన వ్యక్తం చేశామని కెటిఆర్ తెలిపారు. బొగ్గు లేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రం ఎందుకు పెడుతారు..? బొగ్గు, నీళ్లలేని రాయలసీమలో ఎందుకు పెడుతారు..? అని ఆనాడు తెలంగాణ ప్రయోజనాల కోసం తెలంగాణ బిడ్డలుగా గట్టిగా కొట్లాడినం, నిరసనలు వ్యక్తం చేశామని కెటిఆర్ స్పష్టం చేశారు.

**ఆ రెండు ప్రాజెక్టులను ఇప్పుడు టేకాఫ్ చేయండి..**

ఈ దేశంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రం సఫలమైందా..? నేదునూరులో గ్యాస్ అలకేషన్ అయ్యిందా..? ఆనాడు యూపిఏలో జైపాల్ రెడ్డి పెట్రోలియం శాఖ మంత్రిగా ఉండి, గ్యాస్ అలకేషన్ చేయలేదు. గ్యాస్ అలకేషన్ చేయలేదు కాబట్టి ఆ రెండు ప్రాజౌక్టులు టేకాఫ్ కాలేదు. ఇప్పుడు టేకాఫ్ చేయండి మీది ప్రభుత్వం. నేదునూరు, శంకర్‌పల్లిలో ఇప్పుడు ఆ ప్రాజెక్టులు పెడుతామని ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ఈరోజు నోటికొచ్చినట్టు అవమాని స్తున్నారు. అక్కడ అక్బరుద్దీన్ ఓవైసీని, ఇక్కడ మేం మాట్లాడు తుంటే మమ్మల్ని సిఎం అవమానిస్తున్నారని కెటిఆర్ మండిపడ్డారు.

---

## రాష్ట్రపతి నిలయంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**- పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల హైదరాబాద్ పర్యటనలో భాగంగా గురువారం రాష్ట్రపతి నిలయంలో మెట్ల భావి వేదికగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. యువ ప్రతిభావంతులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించారు. రాఘవరాజ్ భట్, మంగళ భట్ ఆకృతి కథక్ కేంద్ర శిష్య బృందం వారి కథక్ నృత్యం, డా.అశోక్ గుర్జాలే ఆరభి వాయిలిన్ స్కూల్ శిష్య బృందం బ్రహ్మమురారి, వాతాపి గణపతి గానాలపై చేసిన వాయిలిన్ ప్రదర్శన ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసాయి.సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం రాష్ట్రపతి నిలయంలో నూతనంగా ప్రారంభించిన మేజ్ గార్డెన్స్‌ను రాష్ట్రపతి సందర్శించారు. అక్కడ, ఆమె రంగురంగుల లైట్లతో అందమైన మ్యూజికల్ ఫౌంటెన్‌ను ఆస్వాదించారు. ప్రకృతి, కళల మిళితం చేసే ఒక ఆహ్లాదకరమైన సన్నివేశం అక్కడ నెలకొన్నది. సాంస్కృతిక గొప్పతనం, ప్రకృతి సౌందర్యం కలగలిసి నేటి రాష్ట్రపతి కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి గవర్నర్ డా. తమిళ సై సౌందర్యరాజన్, రాష్ట్ర గ్రామిణాభివృద్ధి శాఖా మంత్రి సీతక్క తదితరులు హాజరైయ్యారు.

## నేడు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల నేతృత్వంలో ధర్నాలు

**- టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పార్లమెంట్‌లో పొగ బాంబుల దాడి ఘటనను ప్రశ్నించిన ఎంపిలను సస్పెండ్ చేయడం.. సభలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలను నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల నేతృత్వంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపిలను అక్రమంగా, అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిన అంశాలపై ఇండియా కూటమి నిరసన తెలుపుతుందని ఆయన తెలిపారు.పొగ బాంబులు వేసిన అంశంలో హెూంమంత్రి పార్లమెంట్లో ప్రకటన చేయాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోందన్నారు. పార్లమెంట్ భద్రతపై ప్రశ్నిస్తే లోక్‌సభ, రాజ్యసభల్లో ఎంపిలను సస్పెండ్ చేయడం దారుణమని మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇండియా కూటమి రేపు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే అన్ని జిల్లా కేంద్రాల్లో ఇండియా కూటమితో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపడుతారని మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు.



## ముస్లింలు మీ సొంతం కాదు: అక్బరుద్దీన్‌కు సిఎం రేవంత్ కౌంటర్



**తెలంగాణ వీణ//హైదరాబాద్:** కాంగ్రెస్.. అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే.. అక్బరుద్దీన్ ఓడించే ప్రయత్నం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్ పై వాడీవేడీ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసి చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు."అక్బరుద్దీన్ సహచర ఎమ్మెల్యేలను గౌరవించాలి. అధికారంలోకి రాగానే అక్బరుద్దీన్ ను ప్రొటెం స్పీకర్ ను చేశాం. ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. అక్బరుద్దీన్ కేవలం ఎంఐఎం అధినేత మాత్రమే. ఎంఐఎం అనేది ఒక పార్టీ మాత్రమే. ముస్లింలు మీ సొంతం కాదు. అక్బరుద్దీన్ ను మేం ముస్లిం ప్రతినిధిగా చూడట్లేదు. చాంద్రాయణగుట్టలో హిదువులు కూడా అక్బరుద్దీన్ కు ఓటు వేశారు. మాకు ఓల్డ్ సిటీ, న్యూ సిటీ అనే తేడా లేదు. విద్యుత్ బిల్లులు ఎగవేతలో సిద్దిపేట మొదటిస్థానంలో ఉంది. గజ్వేల్ రెండో స్థానం, హైదరాబాద్ సౌత్ మూడో స్థానంలో ఉన్నాయి. సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ సౌత్ నుంచి ఎన్నికైన వారే గత తొమ్మిదేళ్లలో తెలంగాణను పాలించారు. బిఆర్ఎస్, ఎంఐఎం వేరు కాదు.. ఇద్దరూ కలిసే రాష్ట్రాన్ని పాలించారు" అని అన్నారు.

---

## 16,538 మెగావాట్ల విద్యుత్ కెపాసిటీకి రంగం సిద్ధం

**- దేశంలో విద్యుత్ సంస్కరణలు కాంగ్రెస్ హయాంలోనే**

**- గతం కంటే మూడు రెట్లు పెరిగిన విద్యుత్ డిమాండ్**

**- ప్రసుత్తం విద్యుత్ శాఖ అప్పులు రూ.81,516 కోట్లు**

**- ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా**

**- ఇంధన శాఖ శ్వేత పత్రంపై ఎమ్మెల్యే ప్రశ్నలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వివరణ**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ విద్యుత్ అవసరాలను ఎంతో ముందు చూపుతో గణాంకాలు వేశామని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న 5661 మెగావాట్ల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం 16538 మెగావాట్ల విద్యుత్ కెపాసిటీ కి రంగం సిద్ధం చేసినట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్ రంగంపై చర్చకు సమాధానమిస్తూ 2004లో కేంద్రంలో అధికారంలో వున్న యుపిఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే క్రమంలో, జనాభా 58 :32 శాతం, 41.68 శాతం నిష్పత్తి ప్రకారం ఉన్నా కూడా, కీలకమైన విద్యుత్ వనరుల పంపకం తెలంగాణ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 46.11శాతం ఆంధ్రప్రదేశ్‌కు, 53.89 శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించనట్లు చెప్పారు.దేశంలో ప్రతి ఏటా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితమే విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ సంస్కరణల ఫలితంగానే దేశంలోని అనేక రాష్ట్రాలలో కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల స్థాపనకు దారులు పడ్డాయని, విద్యుత్ మార్కెట్ కోసం ఉత్తర, దక్షిణ భారత దేశాలను అనుసంధానించే ట్రాన్స్‌మిషన్ కారిడార్‌కు అవసరమైన ప్రణాళికలు కూడా అప్పుడే రూపుదిద్దుకున్నాయన్నారు. అప్పుడు చేపట్టిన సంస్కరణల ఫలితంగానే, అప్పటి మా ప్రభుత్వం ముందు చూపుతో 2014కు ముందు తెలంగాణ విద్యుత్ అవసరాల కోసం అనేక ప్రాజెక్టులు ప్రారంభించిందని, తరువాత 10 ఏళ్లలో పెరిగే డిమాండును సైతం తట్టుకునే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఇక్కడ పెరిగిందన్నారు.రాష్ట్రం ఏర్పడే నాటికి దాదాపు 5661 మెగావాట్లుగా వున్న డిమాండ్ తరువాత 3 రెట్లు పెరిగి 2023 నాటికి దాదాపు 15,500 మెగావాట్లకు చేరిందని, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసి కొత్తగూడెం థర్మల్ పవర్ కేంద్రం 800 మెగావాట్లు, కాకతీయ థర్మల్ పవర్ (రెండవ దశ) 600 మెగావాట్లు, సింగరేణి – జైపూర్ విద్యుత్ కేంద్రం 1200 మెగావాట్లు, లోయర్ జూరాల హైడల్ కేంద్రం 240 మెగావాట్లు, పులిచింతల హైడల్ కేంద్రం 120 మెగావాట్లు పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడేనాటికి పనుల పురోగతిలో వున్న కేంద్రాలు– 2960 మెగావాట్లు , రాష్ట్ర విభజన చట్టం ద్వారా ఆంధ్ర నుండి అదనంగా 1800 మెగావాట్లు, రామగుండంలో నిర్మించవలసిన థర్మల్ కేంద్రం 4000 మెగావాట్లు, రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన మొత్తం 5800 మెగావాట్లు మొత్తంగా తెలంగాణ విద్యుత్ అవసరాల కోసం అప్పటి మా ప్రభుత్వాలు విద్యుత్ కేంద్రాల కెపాసిటీ 16538 మెగావాట్లు సిద్ధం చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో నమోదైన విద్యుత్ డిమాండ్ 15,500 మెగావాట్ల నుండి భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంపుకు చర్యలు చేపట్టవలసిన గత ప్రభుత్వం, 8వేల మెగావాట్ల ప్రైవేటు సోలార్‌తో కలిపి కేవలం 12వేల మెగావాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నదన్నారు.రాష్ట్రం ఏర్పడేనాటికి జెన్‌కో అప్పులు రూ.7,662 కోట్లు ఉంటే, ప్రస్తుతం రూ. 32,797 కోట్లకు పెరిగిందన్నారు.గత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తానని ప్రకటించిన భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ 7 సంవత్సరాలు గడిచిన పూర్తి కాలేదని అధికారులు అనుసరించిన శాస్త్రీయమైన ఆర్థిక విధానాలే కారణమని మండిపడ్డారు. కాంగ్రెస్ ముందు చూపుతో నిర్మాణం చేసిన పవర్ ప్రాజెక్టులతో వచ్చిన కరెంటు సరిపోవడంతో గత ప్రభుత్వం హయంలో రైతులు రోడ్లపైకి రాలేదన్న సత్యాన్ని మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి గ్రహించాలని సూచించారు. యాదాద్రి భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం, చతీష్‌గడ్ నుంచి కొనుగోలు చేసిన కరెంటు ఒప్పందం పైన మీరు కోరుకున్నట్టుగానే జ్యూడిషియల్ విచారణ కచ్చితంగా చేయిస్తామన్నారు. విద్యుత్ శాఖలో ఆస్తులు పెంచితే డిస్కం నికర విలువ 2021– 22 నాటికి మైనస్ రూ. 30,876 కోట్లకు ఎట్లా వెళ్ళిందని ప్రశ్నించారు.శ్వేత పత్రం విడుదల ద్వారా సభలో చెప్పినవన్నీ వాస్తవాలు విద్యుత్ శాఖకు సంబంధించి అన్ని విషయాలను ఎక్స్‌రే తీసినట్టు చూపించామని, విద్యుత్తు గురించి ఇన్నాళ్లు గొప్పలు చెప్పుకున్న విపక్ష నేతల డొల్లతనాన్ని బయట పెట్టడానికి ఈ శ్వేత పత్రాన్ని అసెంబ్లీలో విడుదల చేశామని చెప్పారు. గత ప్రభుత్వ చర్యలతో విద్యుత్ రంగంలో రూ. 81,516 కోట్ల అప్పులు ఉన్నట్లు తెలిపారు. కృష్ణా ,గోదావరి మంజీరా నుంచి నీళ్లను తీసుకొచ్చి హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఆర్థికంగా కుంగతీసిన తెలంగాణ విద్యుత్ సంస్థలను లేవనెత్తి, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేసి రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్తును అందిస్తామన్నారు. అనంతర అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి.

# మినీ క్రిస్‌మస్ వేడుకల్లో చంద్రబాబు దంపతులు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** క్రిస్‌మస్ పండుగను పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మినీ క్రిస్‌మస్ వేడుకల్లో పాల్గొన్నారు . ఈ మేరకు గురువారం నారా చంద్రబాబు నాయుడు , ఆయన సతీమణి నారా భువనేశ్వరిలు విజయవాడ గుణదలలో ఉన్న మేరీమాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సెమీ క్రిస్మస్ వేడుకల్లో చంద్రబాబు దంపతులు పాల్గొని ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. చంద్రబాబు దంపతులతో పాటు వర్ల రామయ్య, దేవినేని ఉమా మహేశ్వర రావు, జవహర్, అశోక్ బాబు, నాగుల్ మీరా, కొల్లు రవీంద్ర తదితరులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అంతకు ముందు విశాఖ నుంచి ఆయన విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం వద్ద చంద్రబాబుకు టిడిపి నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి మేరీమాత ఆలయానికి వెళ్లారు.

# తిరుమలలో వైకుంఠ ద్వారా దర్శనం కోసం నాలుగు లక్షలకు పైగా టోకెన్లు : టీటీడీ జేఈవో



**తెలంగాణ వీణ/తిరుపతి :** వైకుంఠద్వార దర్శనం టోకెన్లను ఓర్పుతో, అంకితభావంతో భక్తులకు అందజేయాలని తిరుపతిలోని కౌంటర్లలో విధులు కేటాయించిన నోడల్ అధికారులకు, సిబ్బందికి జేఈవో సదా భార్గవి సూచించారు. తిరుపతిలోని శ్వేత భవనంలో గురువారం 4వందల మంది డిప్యుటేషన్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనం కోసం దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు నాలుగు లక్షలకుపైగా టోకెన్లు ఇచ్చేందుకు టీటీడీ విస్తృతంగా ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది విధులు నిర్వహించాలని కోరారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు తదితర సౌకర్యాలను ఆయా కేంద్రాల్లోని నోడల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. భక్తుల ఆధార్ కార్డును ధ్రువీకరించుకుని తేదీల వారీగా వరుస క్రమంలో టోకెన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. తేదీలు, స్లాట్లు మార్చుకునే అవకాశం లేదని వివరించారు. తహసీల్దార్లు, పోలీసులు క్యూలైన్లలో భక్తులను క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. మొత్తం టోకెన్లు పూర్తయ్యే వరకు అన్ని కౌంటర్లలో నిరంతరాయంగా జారీ చేస్తారని చెప్పారు. అనంతరం ఐటీ జీఎం సందీప్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టోకెన్ల కేటాయింపు విధానాన్ని వివరించారు.

### సంక్రాంతి పండుగ సందర్భంగా

# ప్రత్యేక రైళ్ల పొడిగింపు



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త తెలిపింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను పొడిగించింది. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద పండుగల్లో ఒకటైన సంకాంత్రి పండుగ జనవరి రెండోవారంలో ఉన్నందున పలు రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పండుగ నేపథ్యంలో అధిక సంఖ్యలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పది ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ రైల్ సర్వీసులు జనవరి 5 నుంచి ఫిబ్రవరి 1 వరకు టైమ్‌టేబుల్ వారీగా రాకపోకలు కొనసాగిస్తాయని వెల్లడించారు. తిరుపతి–అకోలా, పూర్ణ–తిరుపతి, హైదరాబాద్–నర్సాపూర్, తిరుపతి–సికింద్రాబాద్, కాకినాడటౌన్–లింగంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

### 20 సంక్రాంతి స్పెషల్ రైళ్లు

సంక్రాంతి పండగ సందర్భంగా కాచిగూడ–కాకినాడటౌన్, హైదరాబాద్–తిరుపతి రైల్వే స్టేషన్ల మధ్య 20 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. అందుబాటులో ఉండే అందుకు సంబంధించిన పూర్తి రైళ్ల వివరాలు ఎస్‌సీఆర్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

# రెండు ట్రక్కులు, ఆర్టీసీ బస్సును దగ్ధం చేసిన మావోలు...



**తెలంగాణ వీణ/రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్– ఆంధ్రప్రదేశ్ లోని సరిహద్దులోని చింతూరు మండలంలో బుధవారం రాత్రి ఆర్‌టిసి బస్సుతో పాటు రెండు ట్రక్కులను దగ్ధం చేశారు. రాత్రి 7:30 గంటలకు జగదల్పూర్ నుండి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఆసీర్ గూడెం గ్రామం వద్ద మావోయిస్టులు నిలిపివేసి దగ్ధం చేశారు. అలాగే మరో రెండు ట్రక్కులను డీజిల్ పోసి దగ్ధం చేశారు. చింతూరుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఈ సంఘటన జరిగింది. ఆశీర్వాదం గ్రామం వద్ద తాగునీరు కోసం ప్రయాణికులు దిగిన తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుందని సమాచారం. ఈ సంఘటనలో ఎవరు చని పోలేదని గాయపడలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 2009లోనే వైసీపీ యుద్ధం ప్రకటించింది : కొడాలి నాని




**తెలంగాణ వీణ/అమరావతి :** వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నాని టీడీపీ, జనసేన నాయకులపై మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు, అతడి కొడుకు నారా లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. విజయనగరం జిల్లాలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువగళం ముగింపులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగాలపై విమర్శలు చేశారు. గురువారం ఆయన గుడివాడలో మీడియాతో మాట్లాడారు. ఏపీ సీఎం జగన్ పాలనపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు ఆ నేతలు చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. 2009లోనే వైఎస్ జగన్ యుద్ధం మొదలు పెట్టారని, 2014లో చంద్రబాబును, పవన్‌ను, లోకేష్‌ను ఓడించి జగన్ తన సత్తాను చాటిన విషయాన్ని గుర్తించుకోవాలని హితవు పలికారు. సొంత నియోజకవర్గాల్లో కాకుండా ఇతర నియోజకవర్గాలకు వలసపోయి అక్కడి నుంచి పోటీ చేయనున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లోనూ వైసీపీ విజయ ఢంకా మోగిస్తుందని ధీమాను వ్యక్తం చేశారు.

### అమెరికాలో విజయవాడ

# వైద్య విద్యార్థిని మృతి

**తెలంగాణ వీణ/విజయవాడ:** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఓ అమ్మాయిని మృత్యువు కబళించింది. కారులో ప్రయాణిస్తుండగా గ్యాస్ లీకవ్వడంతో దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళ్తే.. విజయవాడ గ్రామీణం ప్రసాదదంపాడుకు చెందిన షేక్ జహీరా నాజ్ (22) విజయవాడలోని ఓ కాలేజీలో ఫిజియోథెరపీ డిగ్రీ కంప్లీట్ చేసింది. ఎంఎస్ చేయడానికి ఈ ఏడాది ఆగస్టులో అమెరికా వెళ్లింది. షికాగోలోకి ఓ కాలేజీలో చేరింది. కాగా, బుధవారం అమె కారులో వెళ్తుండగా అందులోనుంచి గ్యాస్ లీక్ అయ్యింది. దీంతో కారు డ్రైవర్‌తో పాటు జహీరా స్పృహ తప్పిం ది. ఇది గమనించిన పలువురు వాళ్లను ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపా రు. జహీరా మరణవార్తను ఆమె స్నేహితులు.. విజయవాడలోని కుటుంబసభ్యులకు తెలియజేశారు. కాగా.. జహీరా మృతికి సంబంధించి పూర్తి వైద్య నివేదిక రావాల్సి ఉంది.



# గోదావరిలో దూకిన నవదంపతులు

### - భార్య గల్లంతు... భర్తను ప్రశ్నిస్తున్న పోలీసులు



**తెలంగాణ వీణ/అమరావతి:** వివాహం జరిగిన వారం రోజులకే నవ దంపతులు గోదావరిలో దూకారు. వధువు గల్లంతు కాగా వరుడి ఈదుకుంటూ బయటకు వచ్చిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డిసెంబర్ 15న శివరామకృష్ణతో సత్యవాణికి(19) పెళ్లి జరిగింది. మంగళవారం రాత్రి నవ దంపతులు సినిమాకు బయలుదేరారు. గోదావరి నదిపై సిద్ధాంతం వంతెన వద్దకు రాగానే నవ దంపతులు గోదావరిలో దూకారు. వధువు గల్లంతు కాగా వరుడు ఈదుకుంటూ బయటకు వచ్చాడు. శివ కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. శివను అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నిసతున్నారు. వరుడు నాటకమాడుతున్నాడని వధువు కుటుంబ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. సత్యవాణి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆమెను నదిలోకి తోసిసి ఇప్పుడు నాటకం ఆడుతున్నాడని వధువు బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. అతడు ఈదుకొచ్చిన చోట చెప్పులు ఎలా ఉన్నాయని అడుగుతున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రమాదవశాత్తు వాటర్‌సంప్‌లో పడి ఇద్దరు చిన్నారుల మృతి



**తెలంగాణ వీణ/అమరావతి :** ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. వాటర్‌సంప్‌లో దిగిన ఇద్దరు చిన్నారులకు ఊపిరి ఆడక మృత్యువాత పడ్డారు. జిల్లాలోని రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో గురువారం సాయంత్రం రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు చిన్నారులు కమ్మిలి జశ్వంత్(4), గెట్టం వినూత(3) ఆడుకుంటూ వాటర్‌సంప్ వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడి ఊపిరి ఆడక మృతి చెందారు. తమ పిల్లల జాడ కనిపించడం లేదని పిల్లల తల్లిదండ్రులు గాలించగా చివరకు నీటి ట్యాంకులో కనిపించిన మృతదేహాలను చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడి : సజ్జల



**తెలంగాణ వీణ/అమరావతి :** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హయాంలో దోపిడి పాలన కొనసాగిందని, జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణా రెడ్డి ఆరోపించారు. గురువారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఏపీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో వైఎస్ జగన్ పాలన పారదదర్శకంగా జరుగుతుందని, తండ్రికి మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రజలకు పాలనను చేరవేశారని, ప్రతి గ్రామంలోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆస్పత్రులు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు మారీచశక్తులు మళ్లీ ఏకం అయ్యాయని దుయ్యబట్టారు. **ప్రముఖుల శుభాకాంక్షలు...** బర్త్‌డే సందర్భంగా వైఎస్ జగన్‌కు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, హీరో నాగార్జున పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# తిరుపతి లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య



**తెలంగాణ వీణ/తిరుపతి :** తిరుపతి జిల్లా కేంద్రంలో ఓ భక్తుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలానికి గురిచేసింది. రెండు రోజులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లా సాలూరు గ్రామానికి చెందిన ఉపేంద్ర(52) అనే వ్యక్తి తిరుపతి లాడ్జీలో ఉంటున్నాడు. గురువారం ఆయన ఉంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో లాడ్జీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గది తలుపులను బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిన వ్యక్తిని గుర్తించారు. లాడ్జీ నిర్వాహకుల వద్ద ఉన్న సమాచారం మేరకు మృతుడు మన్యం జిల్లా వాసిగా గుర్తించిన పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## కునో నేషనల్ పార్క్‌లోకి
# నాలుగో చీతా విడుదల



**తెలంగాణ వీణ/షియోపూర్ (ఎంపి):** గత ఏడాది సెప్టెంబర్‌లో నమీబియా నుంచి తీసుకువచ్చిన మగ చీతాను బోను లోంచి కునో నేషనల్ పార్కు నయాగావ్ అడవి లోకి ఈనెల 20న ప్రవేశ పెట్టారు. దీంతో ఈ చీతాల సంఖ్య నాలుగుకు చేరింది. టూరిస్టులు ఈ మగ చీతా పావన్ తోపాటు మరో మూడు చీతాలను సందర్శించ వచ్చని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు 15 చీతాలను బోనుల్లో ఉంచారు. వీటిలో ఏడు మగవి కాగా, మిగతావి ఆడ చీతాలు. ఇవి ఆగస్టు నుంచి బోనుల్లో భద్రంగా ఉంటున్నాయి.నమీబియా నుంచి వచ్చిన చీతాల్లో ఆరు చీతాలు, మూడు పిల్లలు అనేక కారణాల వల్ల చనిపోయాయి. ఇప్పుడు బుధవారం ఆడ చీతా వీరా ను నయగావ్ ఫారెస్ట్ రేంజిలో విడిచిపెట్టారు. దీనికన్నా ముందు అగ్ని, వాయు అనే మగ చీతాలను ఆదివారం పారోంద్ ఫారెస్ట్ రేంజిలో విడిచిపెట్టారు. చీతా సంతతి పునరుద్ధరణ ప్రాజెక్టులో భాగంగా గత ఏడాది సెప్టెంబర్ 17న ఎనిమిది చీతా పిల్లలను నమీబియా నుంచి తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే.

# బీజపూర్‌లో రెండు బస్సులను తగులబెట్టిన నక్సల్స్



**తెలంగాణ వీణ/బీజపూర్:** ఛత్తీస్‌గఢ్ లోని బీజపూర్‌లో గురువారం రెండు బస్సులను నక్సల్స్ తగులబెట్టారు. ఈ రెండు బస్సులు జగదల్‌పూర్, బీజపూర్ మధ్య నడుస్తున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న భద్రతాదళాలు అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో తిమ్మాపూర్ వద్ద ఒక బస్సును ఆపి తగుల బెట్టగా, రెండవబస్సు రాయిపూర్ వెళ్తుండగా దుయిగిడ గ్రామం వద్ద తగుల బెట్టారని బీజపూర్ ఎస్‌పి ఆంజనేయ వర్షెనే చెప్పారు. నక్సల్స్ బాగా రద్దీగా ఉండే బీజపూర్ జగదల్‌పూర్ జాతీయ రహదారికి అడ్డంగా చెట్లను నరికి దిగ్బంధం చేశారని తెలిపారు. భద్రతా దళాలు తమ క్యాడర్ నక్సల్స్‌ను హతమార్చినందుకు నిరసనగా శుక్రవారం సిపిఎం చేపట్టిన బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ప్రచురించిన కరపత్రాలను నక్సల్స్ ఆ ప్రాంతంలో వెదజల్లారు.

## హత్యాచార బాధితురాలిపై పోస్టు తొలగించండి

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ఢిల్లీ హైకోర్టు గురువారం ఆదేశాలు జారీచేసింది. 2021లో హత్యాచారానికి గురైన ఒక మైనర్ దళిత బాలికిని బయటపెట్టిన సోషల్ మీడియా పోస్టును తొలగించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఆ బాలిక గుర్తింపును పరిరక్షించాలని హైకోర్టు ఆదేశించింది. 2021 ఆగస్టు 1న అనుమానాస్పద పరిస్థితులలో మరణించిన ఒక 9 సంవత్సరాల దళిత బాలిక తన తల్లిదండ్రులతో కలసి తీసుకున్న ఫోటోను రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్టు చేశారు. వాయువ్య ఢిల్లీలోని పాత నంగల్ గ్రామంలో ఒక స్మశానవాటిక పూజారి తన కుమార్తెపై అత్యాచారం జరిపి, హత్య చేసి, దహనం చేశాడని ఆ బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు.ఈ పోస్టును పురస్కరించుకుని రాహుల్ గాంధీ ఎక్స్ అకౌంట్‌ను సస్పెండ్ కాగా కొద్దిరోజుల తర్వాత పునరుద్ధరణ జరిగింది. ఈ పోస్టును ఎక్స్ డెలిట్ చేసినప్పటికీ భారత్ వెలుపల ఇది లభ్యతలోనే ఉందని పేర్కొన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ వెంటనే దీన్ని తొలగించాలని రాహుల్ గాంధీ తరఫు న్యాయవాదిని ఆదేశిం చారు. బాధితురాలి గుర్తింపును కాపాడాలంటే ఆ పోస్టును ప్రపంచమంతటా తొలగించాల్సినఅవసరం ఉందని కోర్టు తెలిపింది. బాధితురాలి ఫోటోను ప్రచురించి ఆమె గుర్తింపును బయటపెట్టినందుకు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త మకరంద్ సురేష్ మడ్లేకర్ 2021లో దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం కోర్టు విచారణ జరిపింది. ఈ కేసు తదుపరి విచారణ జనవరిలో జరగనున్నది.



# ఎలక్షన్ కమిషనర్ల బిల్లుకు పార్లమెంటు ఆమోదం



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** ప్రధాన ఎన్నికల కమిషనర్( సిఇసి), ఎన్నికల కమిషనర్ల నియామకాలను నియంత్రించడంతో పాటుగా వారి సర్వీసలుకు నిబంధనలు రూపొందించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది.' ది చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండిషన్స్‌ఫ్ సర్వీస్ అండ్ టెర్మ్ ఆఫ్ ఆఫీస్) బిల్లు2023ను గురువారం స్వల్ప చర్చ అనంతరం లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లుకు రాజ్యసభ ఇదివరకే ఈ నెల 12న ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు సిఇసి, ఎలక్షన్ కమిషనర్లను ప్రభుత్వం నియమించేది. కొత్త బిల్లు ప్రకారం ఇకపై సెర్చ్, ఎంపిక కమిటీలు ఈ బాధ్యతను నిర్వర్తించనున్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు నిబంధనలు లేవని పేర్కొంటూ 1991 చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ కొత్త బిల్లును తీసుకువచ్చింది. బిల్లుపై జరిగిన చర్చకు న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ సమాధాన మిస్తూ ప్రస్తుతం ఉన్న చట్టాల్లో లోపాలను సరిదిద్ది కొత్త బిల్లును తీసుకు వచ్చామని తెలిపారు. అంతేకాదు సిఇసి, ఎన్నికల కమిష నర్ల నియామకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణం గానే ఈ బిల్లు ఉందని వివరించారు.చట్టాన్ని రూపొందిం చేంతవరకు ప్రధాన మంత్రి నేతృత్వంలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీ సిఇసి, ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేస్తుందని సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చిలో చెప్పిందని మంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే ఈ బిల్లు ఉందని, దానికి వ్యతిరేకం కాదని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న కమిటీ తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని కూడా ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా అధికారాల విభజనకు అనుగుణంగా కొత్త బిల్లును రూపొందించామని తెలిపారు. సిఇసి, ఇతర కమిష నర్ల హోదా, వేతనాలకు సంబంధించిన నిబంధనలను కూడా దీనిలో పొందుపర్చినట్లు మేఘ్వాల్ తెలిపారు. పలు ప్రతిపక్ష పార్టీలు, మాజీ సిఇఓల అభ్యంతరాల నేపథ్యంలో రాజ్యసభలో ఈ బిల్లు చర్చకు వచ్చినప్పుడు ప్రభుత్వం పలు సవరణలను చేర్చింది. ఈ బిల్లు ప్రకారం ఏ కోర్టు కూడా సిఇసి లేదా ఎన్నికల కమిష నర్లపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనే వీలుండదు.సిఇసి రాజీవ్ కుమార్, పలువురు ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు యాలని తెలంగాణకు చెందిన స్పెషల్ సెషన్స్ జడ్జి అదేశించడానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు సదరు జడ్జిని సస్పెండ్ చేయాలని ఆదేశిస్తూ ఇటీవల తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బిల్లులో ఈ క్లాజ్‌ను చేర్చారు. సుప్రీంకోర్టు జడ్జిని ఏ కారణాలతో తొలగించవచ్చో ఆ విధంగా తప్ప మరే విధంగాను సిఇసిని తొలగించడానికి వీలు లేదన్న మరో సవరణను కూడా ఈ బిల్లులో చేర్చారు. ఇక రాష్ట్రపతి ఆమోదముద్రో ఈ బిల్లు చట్ట రూపం దాలుస్తుంది.

# మోడీతో దేవెగౌడ, కుమారస్వామి భేటీ



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోడీ గురువారం మాజీ ప్రధాని, జనతా దళ్(సెక్యులర్) అధ్యక్షుడు హెచ్‌డి దేవెగౌడను కలుసుకుని దేశ ప్రగతికి ఆయన అదచేసిన విశేష సేవలను కొనియాడారు. తన కుమారులైన కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి, శాసనసభ్యుడు హెచ్‌డి రేవణ్ణ, మనవడు, హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణతో కలసి దేవెగౌడ ప్రధాని మోడీతో ఆయన నివాసంలో సమావేశమయ్యారు.వారిని కలవడం తనకు ఎల్లప్పుడూ సంతోషాన్ని కలుగచేస్తుందని సామాజిక మధ్యమం ఎక్స్‌లో ప్రధాని మోడీ తెలిపారు. దేశ అభివృద్ధికి ప్రధానిగా దేవెగౌడ చేసిన సేవలను దేశం ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటుందని, ఆయన ఆలోచనలు, వైవిధ్య విధానాలు దార్శనికతతో ఉంటాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఏడాది మొదట్లో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన దరిమిలా జెడిఎస్, బిజెపి పొత్తును ప్రకటించాయి.

# ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రదాడి..ముగ్గురు జవాన్లు మృతి



**తెలంగాణ వీణ/శ్రీనగర్:** జమ్మూ, కశ్మీర్‌లో భద్రతా దళాలే లక్ష్యంగా జరిపిన ఉగ్రదాడిలో ముగ్గురు జవార్లు అమరులయ్యారు. రాజౌరి పూంఛ్ ప్రాంతంలోని దేరాకీ గలీ ప్రాంతం గుండా వెళ్తున్న రెండు ఆర్మీ వాహనాలపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు జవార్లు మృతి చెందగా, మరో ముగ్గరు గాయపడ్డారు.పూంఛ్ జిల్లాలోని బుఫ్లియాజ్ సమీపంలో బుధవారం రాత్రినుంచి ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం జవాన్లు రెండు వాహనాల్లో ఆ ప్రాంతానికి బయలుదేరారు. రాజౌరీ రాణా మండీ సురన్ కోటే రహదారిపై సావ్ని ప్రాంతానికి చేరుకోగానే ఉగ్రవాదులు ఒక్కసారిగా వాహనాలపై కాల్పులు జరిపారు.ఈ దాడిలో ముగ్గురు జవాన్లు అమరులయ్యారు. భద్రతా దళాలు సైతం ఉగ్రవాదులపై ఎదురు కాల్పులు జరిపాయి. సమాచారం అందుకున్న వెంటనే అదనపు బలగాలతో పాటు అంబులెన్స్‌లను ఆ ప్రాంతానికి తరలించినట్లు అధికారులు చెప్పారు. నెల రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో భద్రతా దళాలపై ఉగ్రవాదులు దాడి చేయడం ఇది రెండో సారి. గత నెల రాజౌరి ప్రాంతంలోని కలాకోటె వద్ద భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు కెప్టెన్లు సహా అయిదుగురు జవాన్లు మృతి చెందారు.

# టిఎంసి ఎంఎల్ఏ నివాసంలో ఐటి సోదాలు..



**తెలంగాణ వీణ/కోల్‌కతా:** పన్ను ఎగవేత ఆరోపణలకు సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ ఎంఎల్ఎ బైరాన్ బిశ్వాస్ నివాసంలో జరిపిన సోదాల్లో ఆదాయం పన్ను అధికారులు దాదాపు రూ.70లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారని ఐటి ఉన్నతాధికారి ఒకరు గురువారం చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా సంసేర్‌గంజ్‌లో ఉన్న ఎంఎల్ఎ నివాసంలో బుధవారం ఉదయం మొదలైన ఈ సోదాలు రాత్రి పొద్దుపోయే దాకాదాదాపు 19 గంటల పాటు కొనసాగినట్లు ఆ అధికారి తెలిపారు.ఎంఎల్ఎ నివాసంలో సోదాల్లో తాము దాదాపు రూ.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, అంత పెద్ద మొత్తంలో నగదును ఇంట్లో ఎందుకు పెట్టుకున్నారనే దానిపై క్లారిటీ లేదని ఆ అధికారి చెప్పారు. కాగా సోదాలపై పిటిఐ ఎంఎల్ఎను ఫోన్‌లో సంప్రదించగా, స్పందించడానికి ఆయన నిరాకరించారు. సాగర్‌దిఘి నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన బిశ్వాస్ ఆ తర్వాత టిఎంసిలో చేరారు.

# కొత్త క్రిమినల్ చట్టాలకు పార్లమెంటు ఆమోదం



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** బ్రిటీష్ కాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో తీసుకువచ్చిన మూడు కొత్త బిల్లులకు పార్లమెంటు ఆమోదం లభించింది. బుధవారం లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లులకు గురువారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. చాలావరకు ప్రతిపక్ష సభ్యులు సస్పెండయిన నేపథ్యంలో లోక్‌సభలో మాదిరిగానే రాజ్యసభలో కూడా ఈ బిల్లులకు ఎలాంటి అడ్డంకీ ఎదురు కాలేదు. బిల్లులపై జరిగిన స్వల్ప చర్చకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానమిసూ బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సిఆర్‌పిసి), ఎవిడెన్స్ చట్టం స్థానంలో తీసుకువచ్చిన ఈ కొత్త బిల్లులు క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో నూతనశకానికి నాంది పలుకుతాయని చెప్పారు.ఈ సందర్భంగా సభలో లేనప్పటికీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీనుద్దేశించి షా పరోక్షంగా విమర్శలు చేస్తూ' ఇటాలియన్ కళ్లజోడు ధరించిన వారు కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించిన పార్లమెంటు ఘనత అర్థం కాదు' అంటూ వ్యాఖ్యానించారు.పాత చట్టాల స్థానంలో తీసుకువచ్చిన భారతీయ న్యాయ( రెండవ) సంహిత, సురక్షా( రెండవ) సంహిత, భారతీయ సాక్ష( రెండవ) బిల్లులకు ఉభయ సభల ఆమోదం లభించడంతో ఇవి రాష్ట్రపతిఆమోదం కోసం వెళ్తాయి. రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తర్వాత ఇవి చట్టాలుగా మారుతాయి.

# ఒడిశాలో అత్యంత అరుదైన నల్ల పులులు



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** దేశంలో మొత్తం 10 నల్ల పులులు ఉన్నాయని, అవన్నీ ఒడిశాలోని సిమిలిపాల్ టైగర్ రిజర్వ్‌లోనే కనిపించాయని ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌కు తెలియచేసింది. అత్యంత అరుదైన నల్ల పులులు ఒడిశాలోని సిమిలిపాల్ పులుల అభయారణ్యంలో మాత్రమే ఉన్నట్లు కేంద్ర పర్యావరణశాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే రాజ్యసభలో తెలిపారు.భారతదేశ వ్యాప్తంగా జరుగుతున్న పులుల సంఖ్య లెక్కింపు కార్యక్రమం ప్రకారం 2022లో సిమిలిపాల్ టైగర్ రిజర్వ్‌లో మొత్తం 16 పులులు ఉండగా వీటిలో 10 నల్ల పులులని ఆయన చెప్పారు. వన్యప్రాణి కేంద్రాల సమగ్ర అభివృద్ధి పథకం కింద సిమిలిపాల్ టైగర్ రిజర్వ్‌కు గత కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో రూ. 32.75 కోట్ల ఆర్థిక సహకారాన్ని అందచేసిందని ఆయన తెలిపారు.

# ముక్కోటి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల**





**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ముక్కోటి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. గురువారం భద్రాచలంలో ఉత్తర ద్వార దర్శనం, గోదావరిలో స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాలను పరిశీలించారు. కలెక్టర్ ఉత్తర ద్వారదర్శన సెక్టార్లను, హంసవాహనం ట్రయల్రన్ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22వ తేదీన జరగనున్న స్వామి వారి తెప్పోత్సవం, 23వ తేదీ ఉదయం జరుగనున్న ఉత్తర ద్వారదర్శన కార్యక్రమాలకు విచ్చేయు భక్తులు మన అతిథులని వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె స్పష్టం చేశారు. భక్తులు స్నానాలు ఆచరించడానికి బారికేడింగ్ దాటి గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ట నియంత్రణ చేయాలని చెప్పారు. హంసవాహనంనకు ముందు వెనుక రెండు పైలెట్ నాటుపడవలు ఏర్పాటు చేయాలని చెప్పారు. 40 మంది గజ ఈతగాళ్ళు, 20 నాటు పడవలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అలాగే పర్ణశాలలో 20 మంది గజ ఈతగాళ్ళు, 12 నాటుపడవలు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. బాణసంచాలు కాల్చు సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఉత్తర ద్వారదర్శనం వీక్షణకు విచ్చేయు భక్తులు కేటాయించిన సెక్టార్లలో ప్రవేశానికి తప్పని సరిగా టిక్కెట్ కలిగి ఉండాలని చెప్పారు. భక్తులకు ఎవరికి కేటాయించిన సెక్టార్లలో వారే ప్రవేశించాలని చెప్పారు. ఏర్పాట్లు పర్యవేక్షణ, భక్తులు క్రమపద్ధతి పాటించేందుకు ప్రతి సెక్టారుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. సెక్టార్, లైజన్, ప్రోటోకాల్ విధులు కేటాయించిన అధికారులు ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రతి సెక్టారును భక్తులు గుర్తించేందుకు వీలుగా సైన్బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తుల యొక్క వాహనాలు నిలుపుదల చేసేందుకు పట్టణంలోని ఆర్ అండ్ బి కార్యాలయం, బ్రిడ్జి ప్రక్కన, జూనియర్ కళాశాల మైదానం, మార్కెట్ యార్డులలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్కింగ్ ప్రాంతాల నుండి భక్తులు దేవాలయం వరకు వచ్చేందుకు ప్రత్యేకంగా 25 ఆటోలు ఏర్పాటు చేశామని, అట్టి ఆటోలకు భక్తులు నామమాత్రపు ధర చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. కోర్టు ప్రాంగణం, తానీషా కళ్యాణ మండపం, రాయల్ లాడ్జి, దేవాలయంలో స్వామి వారి ప్రసాదపు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, భక్తులు యంత్రాంగానికి సహకరించాలని చెప్పారు. భక్తులకు సమాచారం అందించేందుకు కొత్తగూడెం బస్టాండు, రైల్వే స్టేషన్, భద్రాచలం బ్రిడ్జి పాయింట్, (టోలేట్) బస్టాండు, స్నాన ఘట్టాలు, విస్తా కాంప్లెక్సు, కూనవరం రోడ్, మార్కెట్యార్డు, చర్ల రోడ్లలో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తప్పిపోయిన భక్తులు సమీపంలోని సమాచార కేంద్రాల్లో కానీ, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము 08743-232444 నెంబర్లుకు కాల్ చేయాలని చెప్పారు. సమాచార కేంద్రాల్లో భక్తులకు ఉపయోగపడు సమాచారపు కరపత్రాలు అందుబాటులో ఉంచాలని డిపిఆర్ ను ఆదేశించారు. అత్యవసర సేవలకు అత్యవసర చికిత్సా కేంద్రాలు ఏర్పాటుతో పాటు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో బెడ్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అత్యవసర చికిత్సా కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఏదేని అత్యవసర సేవలకు వినియోగించడానికి వీలుగా అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారిని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసేందుకు ప్రత్యామ్నయ ఏర్పాట్లుతో సిద్దంగా ఉండాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టిసి అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణకు అదనపు సిబ్బంది ఏర్పాటుతో పాటు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను కేటాయించాలని డిపిఓకు సూచించారు. భక్తులు వేడుకలు వీక్షించేందుకు వీలుగా సెక్టార్లలో ఎల్ఈడి టివిలు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. హెరీటల్లో తినుబండారాలు, స్వామివారి తీర్థప్రసాదాల నాణ్యతలు పర్యవేక్షణ చేయాలని పౌర సరఫరాలు, ఆహార తనిఖీ అధికారులను ఆదేశించారు. సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని మిషన్ బగీరథ అధికారులకు సూచించారు. విధులు కేటాయించిన అధికారులకు, సిబ్బంది గుర్తింపు కార్డులు ధరించాలని, గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతి ఉంటుందని చెప్పారు. 22, 23 తేదీల్లో మద్యం, మాంసాహారం విక్రయాలు నిలిపి వేయాలని ఆబ్కారి, పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.రాంబాబు, మధుసూదన్ రాజు, ఎఎస్పి పరితోష్పంకజ్, ఆర్డీఓ మంగీలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ముర్రేడు బ్రిడ్జిపై పొంచి ఉన్న ప్రమాదం!

**- బయటపడిన ఇనుప చువ్వలు - అధ్వానంగా ఫుట్ పాత్**

**- ఇబ్బంది పడుతున్న వాహనదారులు - పట్టించుకోని అధికారులు**





**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో ఉన్న ముర్రేడు బ్రిడ్జి గుంతల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షపు నీరు బ్రిడ్జిపై నిల్వ ఉండడంతో కంకర తారు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా బ్రిడ్జి నుండి ఇను చువ్వలు ఐరన్ ప్లేట్లు బయటపడి దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారడంతో పాటు వాహనాలు సైతం మరమత్తులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి పొడవునా కంకర కొట్టుకుపోయి నెర్రలు బారడంతో పాటుగా ఫుట్ పాత్ సైతం అస్తవ్యస్తంగా తయారయింది. కారణంగా ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. బ్రిడ్జి దుస్థితిపై సంబంధిత అధికారులకు ఎవరైనా పలుమార్లు ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప శాశ్వత పరిష్కార మార్గం చూపడం లేదని కొంతమంది వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. బ్రిడ్జిపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంటల వల్ల ద్విచక్ర వాహనాల టైర్లు ఆ గుంతలో పడడంతో కుదిపేస్తున్న పరిస్థితి ఉంది. ఇంత దారుణ పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా ఉండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటలు ఐరన్ మెస్ వల్ల భారీ ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతే తప్ప అధికారులు సీరియస్ గా స్పందించే పరిస్థితి లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదాలు జరగకముందు ప్రాణాలు పోకముందే సంబంధిత అధికారులు స్పందించి ముర్రేడు బ్రిడ్జికి శాశ్వత మరమ్మతులు చేయాలని వాహనదారులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** కోవిడ్ పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్ లో కోవిడ్ ముందస్తు నియంత్రణ చర్యలపై వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కోవిడ్ వ్యాప్తి చెందకుండా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మే నెల నుంచి కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. ఇప్పుడు కొవిడ్ లక్షణాలున్నవారికి పరీక్షలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రు ల్లో కొవిడ్ బెడ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొవిడ్ నియంత్రణకు డ్రగ్స్, ఆక్సిజన్, వెంటిలేటర్లు, పీపీఈ కిట్లు, మాస్క్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలని చెప్పారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి శిరీష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో గుర్తింపు ఎన్నికలకు లైన్ క్లియర్

**- 27న కోల్‌బెల్ట్ వ్యాప్తంగా ఎన్నికల సందడి - ఏర్పాట్లలో సింగరేణి యాజమాన్యం**

**- ప్రచారంలో కార్మిక సంఘాలు - యూనియన్ కార్యకర్తలు కార్మికుల హర్షం**





**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు జరిపేందుకు లైన్ క్లియర్ అయింది. ప్రస్తుతానికి ఎన్నికలను వాయిదా వేయాలని ప్రభుత్వం కోర్టులో పిటిషన్ వేయడం జరిగింది. ఈ పిటిషన్ పై గురువారం విచారణ జరిగింది. ఎన్నికల వాయిదా కుదరదని అనుకున్న సమయానికి ఎన్నికలు జరపాలని కోర్టు తీర్పునివ్వడంతో ఎన్నికలపై ఉత్కంఠం వీడింది. దీంతో ఈనెల 27వ తేదీన సింగరేణి కోల్ బెల్ట్ వ్యాప్తంగా వ్యాప్తంగా గుర్తింపు ఎన్నికల సందడి జరగనున్నది. ఇందుకుగాను సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్ కంపెనీలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఇప్పటికే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) మూడుసార్లు, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్(ఐ ఎన్ టి యు సి) ఒక్కసారి, తెలంగాణ బొగ్గు గాని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రెండుసార్లు గెలిచి అధికారాన్ని చేపట్టిన విషయం అందరికి తెలిసిందే. మొత్తము ఆరుసార్లు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. ఏడోసారి సింగరేణి కోల్ బెల్ట్ వ్యాప్తంగా ఎన్నికల కోలాహలం మొదలుకానున్నది. ఎట్టకేలకు సింగరేణి గుర్తింపు ఎన్నికలకు లైన్ క్లియర్ కావడంతో ఇటు యూనియన్ కార్యకర్తలు అటు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెప్పోత్సవం వైకుంఠ ద్వార దర్శనానికి పటిష్టమైన బందోబస్తు

**- భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జి**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ఈనెల 22వ తేదీన జరగబోయే తెప్పోత్సవం 23వ తేదీన జరగబోయే వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జి తెలిపారు. గురువారం ఎస్పీ జిల్లా పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఉత్సవాలకు భద్రాచలానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పార్కింగ్ స్థలాలు, లడ్డూ కౌంటర్స్, సెక్టార్ ప్లాన్స్ ను సూచించే విధంగా https://mukkoti.netlify.app/ లింకుతో పాటు క్యూఆర్ కోడ్ ను కూడా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సెక్టార్ల వారిగా బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పాలు సూచనలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రాచలం పట్టణంలో రామాలయ పరిసర రహదారులలో ట్రాఫిక్ ఆంక్షలను విధించడం జరుగుతుందని తెలియజేసారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఘనంగా ఏపీ సీఎం జగన్మోన్ మోహాన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**తెలంగాణ వీణ/కాప్రా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమసధకాలు అమలు చేస్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నరని గ్రేటర్ వైసిపి నాయకుడు సర్వేపల్లి రవికుమార్ అన్నారు. గురువారం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాప్రాలో వైసిపి నాయకులతో కలసి అనాధశ్రమంలో పండ్లు పంపిణీ చేసి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ పేదప్రజల కష్టాలు తెలుసుకునేందుకు సుధీర్గ పాధయాత్ర చేసిన అనుభవంతో పేదల కష్టాల తీర్చేందుకు నవరత్నాలను అమలు చేస్తున్నరని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో సంక్షేమ పధకాలు అమలు చేస్తున్న మనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. పాలనవరంగా దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు అంధ్రలో అమలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి మరో ఇరువై సంవత్సరాలు అధికారంలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.అయప్ప, కిష్ణమూర్తి, సత్యానారయణ, బసవిరెడ్డి, పవన్, ప్రవీణ్ కుమార్, శంకర్ రెడ్డి, ప్రసాద్, నాగమణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్బారన్యేశ్వరా స్వామి వారి శనిపేయర్చి ఫెస్టివల్ వేడుకలు...

**- సోలీస్ ఐకేర్ ఆధ్వర్యంలో లక్షన్నర మందికి అన్నదానం..**



**తెలంగాణవీణ/కాప్రా:** పాండిచ్చేరిలోని కరాయికల్ జిల్లా తిరునల్లార్ లోని శ్రీ ధర్బారన్యేశ్వరా స్వామి దేవస్థానం శ్రీ శనేశ్వరా భగవాన్ స్థలంలో శనిపేయర్చి ఫెస్టివల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఈసీఐఎల్ చౌరస్తాలోని సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తధ్వర్యంలో లక్ష 50 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికపూడి గాంధీ, సోలిస్ కంటి ఆసుపత్రి చైర్మన్ రాము, మాజీ లేబర్ కమీషనర్ శ్రీనివాస్, విహెచ్ పి ఇంచార్జీ రాఘవులు, ప్రముఖ పారిశ్రమిక వేతలు ముప్పవరపు సురేష్ బాబు, భరత్ షా(బెలిజ్జియం), సురేష్, ప్రముఖ ఆడిటర్ శివరాం, హెల్త్ అడ్డా హాస్పిటల్స్ కోటేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సోలిస్ కంటి సిబ్బందితో పాటు వెయ్యి మంది వాలంటీర్లు పాల్గొన్నారు. రెండు రోజులుగా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వీరామంగా పాండిచ్చేరి ప్రభుత్వ అధికారుల సహకారంతో జరుగుచున్నది. పోలీస్ అధికారులు విజయేందర్ రెడ్డి, చంద్రశేఖర్, గజేందర్ తదితరులు బ్రహ్మోత్సవాల నిర్వహణకు సహకరించాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికపూడి గాంధీ మాట్లాడుతూ శనిపేయర్చి ఫెస్టివల్ సందర్భంగా లక్షలాదిమందికి అన్నదాన కార్యక్రమం చేపట్టిన సోలిస్ ఐ కేర్ నిర్వాహకులు నందనంపాటి రామాంజనేయులు అభినందించారు. రెండున్నర సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ ఉత్సవాలలో భక్తులకు సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు.

## రేపు భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు..

**తెలంగాణ వీణ/ములుగు:** మావోయిస్టులు రేపు భారత్ బందు కు పిలుపునిచ్చారు ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసులు హైఅలెర్ట్ ప్రకటించారు. దీంతో పోలీసులు తెలంగాణ ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. దండ కారణ్యాన్ని భద్రత బలగాలతో జల్లెడ పడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు . ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులు విధ్వసం సృష్టించారు అల్లూరి జిల్లా చింతూరు ఏజెన్సీలో వీరాపురం దగ్గర వాహనాలపై మావోయిస్టులు దాడికి పాల్పడ్డారు కార్లకు నిప్పు పెట్టారు రేపు తాము ఇచ్చిన భారత్‌బంద్ పిలుపుని విజయవంతం చేయాలంటూ కరపత్రాలను మావోయిస్టులు వదిలి వెళ్లారు అయితే మావోయిస్టుల డిమాండ్స్‌పై ఎలాంటి సమాచారం రాలేదు.



## మృతుడి పార్థివదేహానికి నివాళులర్పించిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్



**తెలంగాణ వీణ/ములుగు:** మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, దిగవంత నేత ములుగు జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కుసుమ జగదీషన్న తమ్ముడు కుసుమ జయ ప్రకాష్ (హార్ట్ ఎటాక్) గుండె నొప్పితో మరణించాడు.విషయం తెలుసుకున్న తస్లీమా గురువారం ఉదయం మల్లంపల్లి గ్రామంలో మృతుడి పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మరణం బాధాకరమని మృతుడి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి సూర్య





**తెలంగాణ వీణ/ములుగు:** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు ములుగు మండల జగ్గన్నపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అచ్చ శ్రీనివాస్ గారు స్వర్గస్తులైనారని తెలిసి వారి నివాసం వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అన్ని విధాల కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా ములుగు మండల దేవనగరం గ్రామం లో కునూరు సాధనందం గౌడ్ గారు ఇటీవల స్వర్గస్తులైనారని తెలిసి వారి నివాసం వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబనికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ యువ నాయకులు ధనసరి సూర్య నియోజకవర్గ నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, మండల సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బలుగూరి స్వరూప పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**తెలంగాణ వీణ/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో ఎస్సీ కాలనీ చెందిన బలుగూరి స్వరూప అనారోగ్యంతో మరణించగా ఆమె పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ములుగు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాదం ప్రవీణ్, ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి అనిల్ ,జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బోడ రఘు, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కోకిల రాంబాబు, పట్టణ కార్యదర్శి ఓరుగంటి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు బోడ సతీష్, ములుగు పట్టణ ప్రధాన కార్యదర్శి ఉల్లేరావు శ్రవణ్, బద్రి తదితరులు పాల్గొన్నారు.



## బందెల దొడ్డిని తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల!

**- మురుగు కంపులో విద్యాభ్యాసం - పాఠశాల పరిసర ప్రాంతాల అపరిశుభ్రం**

**- పగలు పందుల సంచారం - రాత్రి మద్యం ప్రియుల గ్లాసులు గలగల**

**- దృష్టి సారించని విద్యాశాఖ అధికారులు**









**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని నెహ్రూ బస్తీ ఏరియాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమస్యలకు నిలయంగా నిలిచింది. బడి చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటుగా మురుగు కంపు మధ్య విద్యార్థులకు విద్యా బోధన జరగడం దారుణం. విద్యా బోధన సమయంలో పందులు తరగతి గదుల ముందు సంచరించడం రాత్రి సమయంలో తరగతి గదుల వరండా మద్యం ప్రియులకు నిలయంగా నిలుస్తూ గ్లాసులు గలగల మంటున్నాయి. పాఠశాల చుట్టూ ప్రహరీ లేని కారణంగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు వైపులా చెత్తాచెదారం ఉండడంతో దోమలు విపరీతంగా తిరుగుతూ విద్యార్థులపై దాడి చేస్తున్న పరిస్థితి ఉన్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. నెహ్రూ బస్తి విద్యాలయంపై విద్యాశాఖ అధికారుల దృష్టి లేకపోవడం వల్లనే ఆ సరస్వతి నిలయం సమస్యల వలయంగా మారిందని కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపణలు చేయడం గమనార్హం. పాఠశాలకు రక్షణ కరువైందని మంచినీటి సౌకర్యం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఒక దిక్కు పాలకులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఈ పాఠశాల దుస్థితి చూస్తే బలోపేతం ఏ విధంగా చేస్తున్నారో స్పష్టంగా కనబడుతుందని ప్రజలు గుర్రమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నెహ్రూ బస్ పాఠశాల అభివృద్ధికి బాటలు వేసే విధంగా చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## తిమ్మంపేట గ్రామ పంచాయతీ సిబ్బందినీ, వాచర్లను సన్మానించిన జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ దంపతులు



**తెలంగాణ వీణ/ములుగు:** ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలో జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ గారి పెళ్లి రోజు సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండేలా అహర్నిశలు కృషి చేస్తున్న, గ్రామపంచాయతీ సిబ్బందిని, వాచర్లను జడ్పీటీసీ మేమొంటో లు అందించి, శాలువాలతో సన్మానిం చారు. జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. అలాగే వాచర్లు రోడ్డుకి ఇరువైపులా ఉన్న మొక్కలకు, పాదులు పెడుతూ, వాటికి నీటిని అందిస్తూ, మొక్కల సంరక్షణలో ప్రధానపాత్ర వహిస్తున్నారని, రోడ్డుకి ఇరువైపులా ఉన్న గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగిస్తూ రోడ్డులను శుభ్రంగా ఉంచడం అభినందనీయమని,వారిని సంత్కరించే అవకాశం మాకు రావడం, సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా,గ్రామ పంచాయతీ సిబ్బందిని, వాచర్లను, జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, శాలువా కప్పి, మేమెంటోలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంద మల్లేష్, మాజీ సర్పంచ్ మంద రాజయ్య,వార్డు మెంబర్లు జోగు స్వామి, మండల ప్రభాకర్, తాళ్లపల్లి రమేష్ , పిఏసిఎస్ డైరెక్టర్ అబ్బరబోయిన నాగరాజ, మాజీ డైరెక్టర్ కుంభోజి శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నూకల మల్లేష్, రైతు కోఆర్డినేటర్ సింగిరెడ్డి మాధవులు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ , మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెండ్లి శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ కుంబోజి మాధవులు, మార్క కుమార్ గ్రామపంచాయతీ సిబ్బంది, వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి డే ఉత్సవాలను జయప్రదం చేయండి

**- సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కే.బసవయ్య**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సింగరేణి దినోత్సవ వేడుకల ఉత్సవాలకు సింగరేణియులు వారి కుటుంబ సభ్యులు పట్టణ పరిసర ప్రాంత ప్రజలందరు పాల్గొని ఆనందించి జయప్రదం చేయాలని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కే.బసవయ్య పిలుపునిచ్చారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిఎం వెల్ఫేర్ బసవయ్య సింగరేణి డే వేడుకల సంబంధించిన వివరాలను వెల్లడించారు. దక్షిణభారత దేశ ఇంధన వనరుల అవసరాలను తీరుస్తూ 135 సంవత్సరాల ఘన చరిత్ర కలిగి తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ లక్షలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తూ సంక్షేమ కార్యక్రమాల్లో తలమానికంగా నిలిచిన మన సింగరేణి సంస్థ ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకలను ప్రతి డిసెంబర్ 23వ తేదీన కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకలలో పాల్గొనే ప్రముఖ సినీ, టీవి కళాకారుల ప్రదర్శనల గోడ పత్రికను ఆవిష్కరించుకోవడం జరిగిందని తెలిపారు. ఆవిష్కరించారు. వేడుకల్లో సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని జిఎం వెల్ఫేర్ బసవయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కే.బసవయ్య, జిఎం(సెక్యూరిటీ)దీక్షితులు, జిఎం(ఈఈ అండ్ సిఎస్ఆర్) కవితా నాయుడు, ఏజిఎం(పర్సనల్) కే.శ్రీనివాస రావు, డివైపిఎం బి.సుశీల్, సీనియర్ పిఓలు టి.శ్రీనివాస రావు, జి.కె.కిరణ్ కుమార్, వెల్ఫేర్ పిఏ వరప్రసాదరావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్లు ఎంసీ పోస్నెట్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రభాకర్, సేవా కో-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల అభివృద్ధిని పట్టించుకోని ఐటీడీఏ పిఓ

**- ఆదివాసీల అభివృద్ధి కోసం ఆదివాసీ సంఘలా కో ఆర్డినేషన్ మీటింగ్ రెండు సంవత్సరాలుగా పెట్టని ఐటీడీఏ పిఓ - ఆదివాసీ గిరిజనుల అభివృద్ధిపై పక్షపాతం చూపెడుతున్న ఏటూరునాగారం ఐటీడీఏ పిఓ**

**తెలంగాణ వీణ/ములుగు/ఏటూరునాగారం:** ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో ఆదివాసీల అభివృద్ధి కోసం పాలన విధానం 29శాఖలోని జిఓలు 1/70.పేసా చట్టం.ఆటవిహక్కుల చట్టం అమలు కోసం 5వ షెడ్యుల్ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనుల విద్య విధానం వలస వాద గిరిజనేతర వలసలు అరికట్టుటకోసం ఆదివాసీల మీద పారెస్టు అధికారులు చేస్తున్న దాడుల మీద ఐటీడీఏ ఏటూరునాగారం కేంద్రంగా ఆదివాసీ సంఘాల తోని ఒక కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రణాళికలు చేపించాలని గత రెండు సంవత్సరాలు కాలంగా ఎన్నోసార్లు ఆదివాసీ సంఘాలు విన్నవించుకున్న కానీ నేటివరకు పట్టించుకోకుండా కాలయాపన చేశారు కానీ 2024 మేడారం జాతరను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాలతోని కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయటం విడ్డురంగా ఉన్నదని అన్నారు.ఆదివాసీలను సమాజంలో అన్ని రకాలుగా ఆర్థిక ఉద్యోగ.ఉపాధి.మొదలగు రంగాలలో అభివృద్ధి చేయడానికే కేటాయించబడిన ఐటీడీఏ పిఓ ఆదివాసీల అభివృద్ధి కోసం ఆదివాసీ సంఘలాతోని కో ఆర్డినేషన్ మీటింగ్ నేటివరకు ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరం అని ఐటీడీఏ పిఓ ఏటూరునాగారం గారికి ఆదివాసీ ప్రజల మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే ఆదివాసీ సంఘాలతోని కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం(ఎయస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల.సుమన్ పత్రిక ముకంగా డిమాండ్ చేశారు.

## సింగరేణి దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిఎం పర్సనల్ బసవయ్య



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో డిసెంబర్ 23 వ తేదీన నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకల నిర్వహణ ఏర్పాట్లను గురువారం సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కే.బసవయ్య పరిశీలించారు.ఈ సందర్భంగా జిఎం బసవయ్య ప్రధాన వేడుకల వేదిక వివిధ విభాగాల వారు ఏర్పాటు చేసే స్టాల్స్ ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ వేడుకలకు వచ్చే ముఖ్య అతిథులకు, సింగరేణీయులకు వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కావలసిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఆర్‌సి కే.బసవయ్య, ఏజిఎం(పర్సనల్) కే.శ్రీనివాస రావు, సూపర్ బజార్ ఎండి సామ్యూల్ సుధాకర్, డిజిఎం(సివిల్) పి.రాజ శేఖర్, డిజిఎం(ఈ అండ్ ఎం) మెయిన్ వర్క్ షాప్ రాజీవ్ కుమార్, డివై.పిఎం బి.సుశీల్, డివైఎస్ఈ (సివిల్) రవి కుమార్, సీనియర్ పిఓ జికే.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం





**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ప్రపంచ దివ్యంగుల దినోత్సవ సందర్భంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీలోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. హేమచంద్రాపురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, లక్ష్మీదేవిపల్లి మండలం విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందిరానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.జ్యోతి రాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ సర్పంచ్ పూనెం నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ భద్రాద్రి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, దివ్యాంగుల జేఏసీ చైర్మన్ గుండపునేని సతీష్, విద్యా కమిటీ చైర్మన్ చాంద్ పాషా, ఫిజియోథెరపిస్ట్ రూతమ్మ, టీచర్లు శౌరి ఇన్నయ్య, షాజియా తబ్సుమ్, భవిత సెంటర్ టీచర్స్ జానకి, స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు కళ్యాణి, స్రవంతి, స్వప్న, సునంద, కృష్ణకుమారి, సత్యనారాయణ, గౌస్, ఉమా, దివ్యాంగ పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. దివ్యాంగులకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. దివ్యాంగ పిల్లలకు ఐదవ తరగతి విద్యార్థులు కూడా దివ్యాంగ పిల్లలకు తమ తోచిన విధంగా బహుమతుల రూపంలో సహకరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలు తల్లిదండ్రులు ఆటపాటలతో అలరించారు.

## తుమ్మలను సన్మానించిన మద్దెల మిత్రబృందం



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:**అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సింగరేణి జనరల్ మేనేజర్ అందెల ఆనందరావు మిత్ర బృందం గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ తుమ్మల ఇదివరకే ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో మంత్రి పదవులు అత్యంత సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. అపార అనుభవం సీనియారిటీ అధికారులతో ఉన్న సంబంధాలు అంకితభావం దృఢమైన దీక్ష దక్షతలు నేడు తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా నడపడానికి ఎంత దోహదపడతాయని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎంతో గొప్ప గర్వకారణమని ఆచార్య డాక్టర్ మద్దెల ఉద్ఘాటించారు. అనంతరం సన్మాన గ్రహీత తుమ్మల నాగేశ్వరరావు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# తిలక్ వర్మ, గైక్వాడ్ జట్టులో ఉంటారా?.. నేడే చివరి వన్డే



దక్షిణాఫ్రికా- ఇండియాల మధ్య కీలకమైన చివరి మ్యాచ్ కు రంగం సిద్ధమైంది. ఇప్పటివరకూ ఇరు జట్లూ చెరో మ్యాచ్ లోనూ గెలిచి సమవుజ్జీలుగా ఉన్నాయి. సిరీస్ ఎవరిదో తేల్చే చివరి మ్యాచ్ పార్ల్ లో ఈ రోజు సాయంత్రం జరగబోతోంది. టీమిండియా ఓపెనర్లలో కొత్తగా అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్ అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నాడు. అయితే మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ ఈ సీరిస్ లో వెనుకబడటం జట్టును కుంగదీస్తోంది. అతను మొదటి మ్యాచ్ లో ఐదు పరుగులకు, రెండో మ్యాచ్ లో నాలుగు పరుగులకు అవుటయ్యాడు. మరోవైపు తిలక్ వర్మ ఆటతీరు కూడా చెప్పుకోదగిన స్థాయిలో లేదు. వీళ్లిద్దరూ రాణిస్తే, మూడో మ్యాచ్ లో టీమిండియాకు విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. రెండో వన్డేలో గెలిచిన దక్షిణాఫ్రికా.. మూడో మ్యాచ్ లోను గెలిచి, సీరీస్ ను కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. రెండో వన్డేలో జోర్జి సెంచరీ చేసిన విషయం తెలిసిందే.

# డోప్ పరీక్షలో పాజిటివ్.. ఇద్దరు క్రికెటర్లపై నిషేధం విధించిన జింబాబ్వే



డోప్ పరీక్షలో అథ్లెట్లు పట్టుబడడం విన్నాం. కానీ, ఇప్పుడు క్రికెటర్లు సైతం ఫిట్‌నెస్ కోసం నిషేధిత డ్రగ్స్‌వాడుతూ దొరక పోతున్నారు. తాజాగా ఇద్దరు జింబాబ్వే క్రికెటర్లు డోప్ పరీక్షలో పట్టుబడ్డారు. ఆల్‌రౌండర్లు వెస్లీ మధేవెరె, బ్రాండన్ మవుతా నిషేధిత డ్రగ్ తీసుకున్నారు. దాంతో, ఆ దేశ క్రికెట్ బోర్డు ఈ ఇద్దరిని సస్పెండ్ చేసింది. విచారణకు హాజరయ్యేంత వరకూ క్రికెట్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొనవద్దని ఆదేశించింది.త్వరలోనే జింబాబ్వే క్రికెట్ బోర్డు క్రమశిక్షణ కమిటీ ముందు వెస్లీ, మవుతా హాజరుకానున్నారు. అ కమిటీ ముందు వీళ్లు తమ వాదనలు వినిపిస్తారు.అనంతరం ఈ ఇద్దరిపై ఎన్ని రోజుల నిషేధం విధిస్తారు కమిటీ నిర్ణయం తీసుకోనుంది.

# అవార్డులతో మెరిసిన తెలంగాణ తారలు క్రీడారత్నాలు..

**- సాత్విక్, చిరాగ్ జోడీకి ఖేల్ రత్న**



**న్యూఢిల్లీ:** కేంద్ర క్రీడాశాఖ 2023 ఏడాదికి గాను వార్షిక క్రీడా అవార్డుల విజేతలను ప్రకటించింది. మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుతో పాటు అర్జున, ద్రోణాచార్య అవార్డులను బుధవారం ప్రకటించింది. మొత్తం 26 మంది ప్లేయర్లు అర్జున అవార్డులను కైవసం చేసుకున్నారు. జనవరి 9న జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్‌శెట్టి ద్వయం..ప్రతిష్మాత్మక ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు విజేతగా నిలిచింది. గత కొంత కాలంగా ఈ యువ జోడీ చిరస్మరణీయ విజయాలతో సత్తాచాటుతున్నారు. ఇటీవల హౌంగ్జౌ (చైనా) వేదికగా ఆసియాగేమ్స్‌లో పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన సాత్విక్, చిరాగ్..ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం దక్కించుకున్నారు.గతేడాది అర్జున అవార్డు కైవసం చేసుకున్న ఈ ఆంధ్ర కుర్రాడు.. ఖేల్ రత్న అవార్డును ఖాతాలో వేసుకున్నాడు. 'ఖేల్ రత్నకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ప్రతిష్మాత్మక అవార్డు వచ్చిందన్న వార్త తెలిసి అసలు నమ్మకలేకపోయాను. ఇంత తక్కువ వ్యవధిలో ఖేల్ రత్న వస్తుందని ఊహించలేకపోయాను. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకునేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నా.అదే రోజు మలేషియా ఓపెన్ మొదలవుతున్నందున ఒకవేళ నేను అందుబాటులో లేకపోయినా..నా తరఫున తల్లిదండ్రులు స్వీకరిస్తారు. నేను సాధిస్తున్న ఈ విజయాలకు వారే కారణం' అని అన్నాడు. వన్డే వరల్డ్‌కప్‌లో 24 వికెట్లు తీసిన షమీతో పాటు వైశాలి, ఓజాస్ పర్వీన్, శ్రీశంకర్, అజయ్‌కుమార్‌రెడ్డిని అర్జున అవార్డు వరించింది.

### ప్రెస్‌మీట్‌లో కన్నీళ్లు పెట్టిన

# రెజ్లర్ సాక్షి మాలిక్..



రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న భారత రెజ్లర్ సాక్షి మాలిక్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇకపై తాను రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనని చెప్పారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ ఎన్నికల్లో సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా గెలవడంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు.సంజయ్.. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కు సన్నిహిత అనుచరుడు. నిన్న మొన్నటి దాకా సమాఖ్యకు అధ్యక్షుడిగా ఉన్న బ్రిజ్ భూషణ్ పై రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా, వినీత్ ఫోగట్ సహా పలువురు రెజ్లర్లు ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే. బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఢిల్లీ నడిబొడ్డున వారు దీక్షలు చేశారు. దాంతో బ్రిజ్ భూషణ్ ని తప్పించారు.అయితే, బ్రిజ్ భూషణ్ సన్నిహితులను ఎన్నికల్లో పోటీ చేయనివ్వబోమంటూ ఇచ్చిన మాటను క్రీడా మంత్రిత్వ శాఖ నిలబెట్టుకోలేదని సాక్షి మాలిక్ విమర్శించారు. సంజయ్ సింగ్.. బ్రిజ్ భూషణ్ కు కుడి భుజంలాంటి వాడని, వ్యాపారాలలో అతని భాగస్వామి అనీ ఆమె చెప్పారు. సంజయ్ సింగ్ రెజ్లింగ్ సమాఖ్యకు అధ్యక్షుడిగా గెలిచినందున, తాను రెజ్లింగ్ కు గుడ్ బై చెబుతున్నానంటూ తన బూట్లను విప్పి టేబుల్ పై పెట్టి, కన్నీళ్లతో నిష్క్రమించారు.

# ఎనిమిదేండ్లకే 'గ్రాండ్ మాస్టర్' హెూదా.. భారత సంతతి చిన్నారికి సలాం కొట్టాల్సిందే



అరవై నాలుగు గడుల చదరంగం ఆటలో భారతీయులు పలు రికార్డులు నెలకొల్పారు. విశ్వనాథన్ ఆనంద్ నుంచి యువ కెరటం ఆర్ ప్రజ్ఞానంద వరకూ పలువురు ప్రతిష్మాత్మకమైన గ్రాండ్ మాస్టర్ హెూదా పొందారు. తాజాగా ఈ జాబితాలో భారతీయ మూలాలున్న ఎనిమిదేండ్ల అమ్మాయి చేరింది. పసి ప్రాయంలోనే చెస్‌లో గొప్పగా రాణిస్తున్న ఆ చిన్నారి పేరు బోధన శివానందనన్. తాజాగా క్రొయేషియాలో జరిగిన యూరోపియన్ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో బోధన అద్భుతం చేసింది. తనకంటే 30 ఏండ్ల పెద్దదైన, ఎంతో అనుభవజ్ఞురాలైన క్రీడాకారిణిని బోధన అవలీలగా ఓడించింది. మ్యాచ్ ఆరంభం నుంచి తన ఎత్తులతో ప్రత్యర్థిని కంగారెత్తించిన బోధన 8.5 12తో విజేతగా నిలిచి దిగ్గజాలను ఫిదా చేసింది. అంతేకాదండోయ్ 'అత్యుత్తమ మహిళా ప్లేయర్' టైటిల్ సొంతం చేసుకుంది. దాంతో, అందరూ ఆమె ప్రతిభను మెచ్చుకుంటూ సలాం కొడుతున్నారు.

# రాహుల్ ఔట్.. సంజూ శాంసన్ అర్ధ శతకం



టీమిండియా మూడో వికెట్ కోల్పోయింది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలకమైన మూడో వన్డేలో టాస్ ఓడి బ్యాటింగ్ చేపట్టిన భారత్ ఆచితూచి ఆడుతోంది. వన్డేలో టీమిండియా తరఫున అరంగేట్రం చేసిన రజత్ పటీదార్ 22 పరుగులు చేసి.. నాంద్రీ బర్గర్ బౌలింగ్ లో ఔటయ్యాడు. మొదటి రెండు వన్డేల్లోనూ అదరగొట్టిన సాయి సుదర్శన్, కీలకమైన మూడో వన్డేలో నిరాశ పరిచాడు. హెండ్రిక్స్ ఓవర్లో సాయి (10) అవుటయ్యాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ కెఎల్ రాహుల్(21) కూడా విఫలమయ్యాడు. దీంతో 101 పరుగుల వద్ద టీమిండియా మూడో వికెట్ కోల్పోయింది. దీంతో ఒత్తిడిలో పడిన జట్టు బాధ్యతను తీసుకున్న సంజూశాంసన్.. చెత్త బంతులను బౌండరీకి తరలిస్తూ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో సంజూ అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. ప్రస్తుతం భారత్ 29 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. క్రీజులో సంజూశాంసన్(51), తిలక్ వర్మ(9)లు ఉన్నారు.

### తండ్రి రాహుల్ స్టయిల్‌లో..

# కొడుకు సమిత్ ద్రావిడ్ స్ట్రోక్ ప్లే..

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్, ప్రస్తుత కోచ్ రాహుల్ ద్రావిడ్ బ్యాటింగ్ మీకు గుర్తుందా. డిఫెన్స్ ఆడడంలో అతన్ని మించిన క్రికెటర్ లేరు. ఆ టెక్నిక్‌నే అతని కుమారుడు కూడా సొంతం చేసుకున్నాడు. కూచ్ బిహారీ ట్రోఫీలో సీనియర్ ద్రావిడ్ కొడుకు.. 18 ఏళ్ల సమిత్ రాహుల్ ద్రావిడ్ తన బ్యాటింగ్ శైలితో ఆకట్టుకుంటున్నారు. జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో 98 రన్స్ చేసి కర్నాటక జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సమిత్ కేవలం బ్యాటర్ మాత్రమే కాదు.. అతను బౌలింగ్‌లోనూ మేటి ప్రదర్శన ఇవ్వగలడు. ఇక ఆ మ్యాచ్లో అతను మూడు వికెట్లు కూడా తీసుకున్నాడు. తండ్రి రాహుల్ స్టయిల్‌లోనే.. కొడుకు సమిత్ ద్రావిడ్ కూడా కవర్ డ్రైవ్ షాట్లతో అలరించాడు. రాహుల్ ద్రావిడ్ కుమారుడు



సమిత్ ఆడిన కొన్ని షాట్స్‌కు చెందిన వీడియోను చూడండి.

# తొలి రోజు భారత్ హవా..

**ముంబై:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో గురువారం తొలి రోజు భారత మహిళలు ఆధిపత్యం చెలాయించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను 77.4 ఓవర్లలో 219 పరుగులకే పరిమితం చేయడంలో భారత బౌలర్లు సఫలమయ్యారు. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన టీమిండియా ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 98 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే భారత్ మరో 121 పరుగులు చేయాలి. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానలు శుభారంభం అందించారు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. ధాటిగా ఆడిన షఫాలీ వర్మ 59 బంతుల్లో 8 ఫోర్లతో 40 పరుగులు చేసి ఔటైంది. మరోవైపు మంధాన 49 బంతుల్లో 8 బౌండరీలతో 43 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. స్నేహ్ రాణా 4 పరుగులతో క్రీజులో ఉంది.

**ఆరంభంలోనే..** అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ లిచ్‌ఫీల్డ్ ఖాతా తెరవకుండానే రనౌట్‌గా వెనుదిరిగింది. వన్‌డౌన్‌లో వచ్చిన ఎలిసె పేరి 4 పరుగులు చేసి పూజా వస్త్రకర్ వేసిన బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యింది. దీంతో భారత్ 7 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయింది. ఈ దశలో మరో ఓపెనర్ బేథ్ మూనీ, తహిలా మెక్‌గ్రాత్ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన మెక్‌గ్రాత్ 8 ఫోర్లతో వేగంగా 50 పరుగులు చేసి పెవిలియన్ చేరింది. ఈ క్రమంలో మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించింది. కెప్టెన్ హీలీ 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 38 పరుగులు సాధించింది. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన మూనీ 40 పరుగులు చేసింది. చివర్లో కిమ్ గార్థ్ 28 (నాటౌట్) కాస్త రాణించడంతో ఆస్ట్రేలియా స్కోరు 219 పరుగులకు చేరింది. భారత బౌలర్లలో పూజా వస్త్రకర్ నాలుగు, స్నేహ్ రాణా మూడు వికెట్లు పడగొట్టారు.దీప్తి శర్మకు రెండు వికెట్లు దక్కాయి.

# శతకంతో రాణించిన సంజూశాంసన్.. సౌతాఫ్రికా టార్గెట్ 297 రన్స్



కీలకమైన మూడో వన్డేలో టీమిండియా, దక్షిణాఫ్రికా జట్టుకు 297 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్ లో టాస్ ఓడి బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 296 పరుగులు సాధించింది. సంజూశాంసన్(108) శతకంతో అదరగొట్టగా..తిలక్ వర్మ(52) అర్ధశతకంతో రాణించాడు. రింకూ సింగ్(38) ఉన్నంతసేపు ధనాధన్ ఇన్నింగ్స్ అలరించాడు. ఓపెనర్ రజత్ పటీదార్(22), కెప్టెన్ కెఎల్ రాహుల్(21)లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు.

# చీరకట్టు భామను హీరోయిన్‌ను చేసిన ఆర్జీవి..



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. డిఫరెంట్ టేకింగ్ తో తనదైన శైలిలో సినిమాలు తీయడం ఈ దర్శకుడి ప్రత్యేకత. అయితే నిత్యం సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్?గా ఉంటారు.సొసైటీ లో జరిగే సంఘటనలను తనదైన శైలిలో స్పందిస్తూ ఉంటాడు ఈ దర్శకుడు.అయితే కొద్దిరోజుల క్రితం చీర కట్టుకుని రీల్స్ చేసిన అమ్మాయి వీడియోస్ ఆర్జీవి తెగ షేర్ చేశాడు.ఆ అమ్మాయి ఎవరో తెలిస్తే కాస్త చెప్పండి అంటూ పోస్టులు చేశాడు. ఆ అమ్మాయి వీడియోస్ పోస్ట్ చేస్తూ తన పై చీర అనే సినిమా తీస్తానని ప్రకటించారు. ఆర్జీవి చేసిన పోస్టులు బాగా వైరలయ్యాయి. ఇంకేముంది నెటిజన్స్ ఆ అమ్మాయి ఎవరో తెలుసుకునేందుకు ఎంతగానో ప్రయత్నించారు.ఎట్టకేలకు ఆ అమ్మాయి ఇన్ స్టా ఐడీ కనుక్కొని వర్మ కు రిప్లై కూడా ఇచ్చారు. అయితే ఆ చీరకట్టు భామ పేరు శ్రీలక్ష్మీ సతీష్.ఈ భామ మోడ్రన్ దుస్తుల్లో కాకుండా చీరకట్టు లో ఫోటోషూట్స్ చేస్తుంది. చీర కట్టులో ప్రకృతిని ఆస్వాదిస్తూ కొన్ని రీల్స్ కూడా చేసింది. అవి చూసిన వర్మ ఆ అమ్మాయి కోసం వెతుకులాట ప్రారంభించారు. తాజాగా ఆ అమ్మాయిని అంత అందం గా వీడియోస్ తీసిన కెమెరామెన్ ను పిలిపించి ఆర్జీవి మాట్లాడాడు.ఇప్పుడు ఈ భామతో ఆర్జీవి శారీ అనే సినిమా తీస్తున్నాడు.ఈ చిత్రానికి ఆ అమ్మాయిని అందంగా వీడియోస్ తీసిన కెమెరామెన్ అఘోష్ దర్శకుడి గా పరిచయం చేస్తూ శారీ సినిమా ను తెరకెక్కిస్తున్నారు వర్మ. తాజాగా ఈరోజు ఇంటర్నేషనల్ శారీ డే ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని ఆర్జీవీ డెన్ ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. శారీ సినిమాను నిర్మిస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ వర్మ ట్వీట్ చేశాడు.

### ఎంబిబిఎస్ పరీక్షలకు

# శ్రీలీల డుమ్మా

అప్పట్లో హీరోయిన్లు.. డాక్టర్ కాబోయి యాక్టర్ని అయ్యాయని చెప్పుకునేవారు. కానీ మన తెలుగు బ్యూటీ శ్రీలీల యాక్టింగ్ చేస్తూనే మరోవైపు డాక్టర్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎంబిబిఎస్ చివరి సంవత్సరం చదువుతున్న శ్రీలీల.. ఈ మధ్య వారం రోజులు షూటింగ్ కు విరామమిచ్చి, పరీక్షలు రాసేందుకు సీరియస్ గా పుస్తకాలు ముందేసుకుని చదువుతోంది. ఇక్కడే ఆమెకు చిక్కొచ్చి పడింది.శ్రీలీల తాజాగా మహేశ్ బాబుతో కలసి గుంటూరు కారం మూవీలో నటిస్తోంది. సంక్రాంతికి రిలీజ్ చేసేందుకు సినిమా యూనిట్ శరవేగంగా షూటింగ్ జరుపుతోంది. అయితే అకస్మాత్తుగా శ్రీలీల వారం రోజులు సెలవు పెట్టడంతో దర్శక నిర్మాతలు కంగారు పడ్డారు. ఇలాగైతే సంక్రాంతికి సినిమా రిలీజ్ చేయడం కష్టమని భావించి, శ్రీలీలను సంప్రదించారట. దాంతో శ్రీలీల చదువును తాత్కాలికంగా పక్కనబెట్టి, షూటింగ్ కు వచ్చేసిందట. ప్రస్తుతం హీరోహీరోయిన్ల మధ్య జరుగుతున్న డాన్స్ సీక్వేన్స్ లో శ్రీలీల పాల్గొంటోంది. అయితే ఎంబిబిఎస్ ను వదిలిపెట్టనని, సప్లిమెంటరీలో పరీక్షలు రాస్తాననీ ఆమె ధీమాగా చెబుతోంది.



# ఒక్క లీక్డ్ పిక్‌తో సోషల్ మీడియా షేక్




యంగ్ టైగర్ ఎన్టీఆర్, కమర్షియల్ సినిమాలకి మెసేజ్ అద్దిన కొరటాల శివ కలిసి చేస్తున్న సినిమా దేవర. పాన్ ఇండియా మార్కెట్ ని టార్గెట్ చేస్తూ తెరకెక్కుతున్న ఈ సినిమాని కొరటాల శివ హ్యూజ్ కాన్వాస్ తో షూట్ చేస్తున్నాడు. జనతా గ్యారేజ్ తో రీజనల్ బాక్సాఫీస్ ని రిపేర్ చేసిన ఎన్టీఆర్–కొరటాల ఈసారి పాన్ ఇండియా బాక్సాఫీస్ టార్గెట్ గా సినిమా చేస్తున్నారు. ఏప్రిల్ 5న వరల్డ్ వైడ్ రిలీజ్ కి రెడీ అవుతున్న దేవర సినిమాపై అనౌన్స్మెంట్ తోనే అంచనాలు ఏర్పడ్డాయి. ఈ అంచనాలని మరింత పెంచడానికి త్వరలో టీజర్ బయటకి రానుంది. అయితే అది టీజర్ కాదు జస్ట్ దేవర వరల్డ్ ని పరిచయం చేయబోయే గ్లిమ్ప్స్ మాత్రమే అనే టాక్ కూడా వినిపిస్తోంది. న్యూ ఇయర్ లేదా సంక్రాంతి రోజున దేవర నుంచి అప్డేట్ బయటకి వస్తుంది అనే న్యూస్ సోషల్ మీడియాలో స్ప్రెడ్ అవ్వడంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా యాక్టివ్ మోడ్ లోకి వచ్చేసారు.గత కొన్ని రోజులుగా వీ వాంట్ దేవర అప్డేట్ అని ట్వీట్స్ చేస్తున్న ఫ్యాన్స్ కి కిక్ ఇస్తూ దేవర ఆన్ సెట్స్ లీక్డ్ పిక్ బయటకి వచ్చింది. ఎన్టీఆర్, కొరటాల శివ నడుచుకుంటూ వెళ్తున్న ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్టీఆర్ ఫస్ట్ లుక్ లో ఉన్న దేవర గెటప్ లో బ్లాక్ అండ్ బ్లాక్ వేసి కనిపించడంతో ఫ్యాన్స్ మరింత జోష్ లో ఉన్నారు. అభిమానులు ఇదే జోష్ దేవర టీజర్ రిలీజ్ అయ్యే వరకు కంటిన్యూ చేస్తారు. అయితే ఈ లీక్డ్ పిక్ ని షేర్ చేసిన వాళ్ల సోషల్ మీడియా అకౌంట్స్ మాత్రం రిస్క్ లో పడ్డాయి. ఆ అకౌంట్స్ పై దేవర మేకర్స్ యాక్షన్ తీసుకోని క్లోజ్ చేయడం గ్యారెంటీ.

# విజయ్ సేతుపతి, బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ క్రిస్మస్ సినిమా సంక్రాంతికి



మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ కలిసి నటిస్తున్న సినిమా 'మెర్రి క్రిస్మస్'. 2022 డిసెంబర్ 25న విడుదల అవ్వాల్సిన ఈ మూవీ అప్పట్లో వాయిదా పడింది. సరేలే 2023లో క్రిస్మస్ పండక్కి అయినా 'మెర్రి క్రిస్మస్' సినిమాని విడుదల చేస్తారు అనుకుంటే ఈ క్రిస్మస్ కూడా మిస్ అయ్యింది. ఇలా ఏడాదిగా వాయిదా పడుతున్న మెర్రీ క్రిస్మస్ సినిమా ఎట్టకేలకు సంక్రాంతికి రిలీజ్ కానుంది. జనవరి 12న వరల్డ్ వైడ్ ఆడియన్స్ ముందుకు మెర్రీ క్రిస్మస్ సినిమా రానుంది. విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ మూవీని శ్రీరామ్ రాఘవన్ రూపొందిస్తున్నాడు. సైకలాజికల్ థ్రిల్లర్ ని తెరకెక్కించడంలో శ్రీరామ్ రాఘవన్ దిట్ట, ఆయన డైరెక్ట్ చేసిన 'అంధాదున్' సినిమా నేషనల్ అవార్డ్ అందుకుంది.శ్రీరామ్ రాఘవన్ నుంచి ఒక సినిమా వస్తుంది అంటేనే ఎదో కొత్త కథని చూడబోతున్నాం అనే నమ్మకం ఆడియన్స్ లో ఉంది. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూనే 'మెర్రి క్రిస్మస్' ట్రైలర్ రిలీజ్ అయ్యింది. ఈ ట్రైలర్ లో సేతుపతి, కత్రినా మధ్య సీన్స్ టెర్రిఫిక్ గా ఉన్నాయి. కూల్ గా స్టార్ట్ అయ్యి ఇంటెన్స్ రూట్ తీసుకుంది మెర్రీ క్రిస్మస్ ట్రైలర్. కంప్లీట్ గా డైరెక్టర్ శ్రీరామ్ రాఘవన్ స్టైల్ లో కథని ఊహించని విధంగా ట్రైలర్ ని కట్ చేసారు. సినిమాటోగ్రఫీ అండ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ థ్రిల్లర్ మూడ్ లో ఉన్నాయి. ఈ సస్పెన్స్ డ్రామాకి విజయ్ సేతుపతి అడిషనల్ ఎస్సెట్ అయ్యేలా ఉన్నాడు. ట్రైలర్ తో ఇంప్రెస్ చేసిన మెర్రీ క్రిస్మస్ సినిమా థియేటర్స్ లో ఆడియన్స్ ని ఎంతవరకు ఇంప్రెస్ చేస్తుంది అనేది చూడాలి.

# పల్లవి ప్రశాంత్‌ను చంచల్‌గూడ జైలుకు తరలింపు



హైదరాబాద్: అన్నపూర్ణ స్టూడియో వద్ద విధ్వంసం కేసులో బిగ్ బాస్– 7 విజేత పల్లవి ప్రశాంత్, అతని తమ్ముడు రాజును అరెస్ట్ చేయగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఇద్దరినీ చంచల్ గూడ జైలుకు తరలించారు. మరో నిందితుడు వినోద్ పరారీలో ఉన్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన మరి కొందరును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బిగ్ బాస్ 6 కంటెస్టెంట్ గీతూరాయల్ తో కూడా కొందరు అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

# హైదరబాదీ అభిమానులకు షారుఖ్ ఖాన్ ట్వీట్

బాలీవుడ్ సూపర్ స్టార్, కింగ్ ఖాన్ షారుఖ్ హైదరాబాదీ అభిమానులకు ట్వీట్ చేశాడు. దీంతో షారుఖ్ అభిమానులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. షారుఖ్ నటించిన డంకీ గురువారం రిలీజైంది. ఈ ఏడాది ఇప్పటికే జవాన్, పఠాన్ వరుస హిట్లతో జోరు మీదున్న షారుఖ్.. డంకీతో హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. పైగా హిట్ చిత్రాల దర్శకుడు రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో రూపొందడంతో డంకీపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. డంకీ విడుదల నేపథ్యంలో షారుఖ్ హైదరాబాదీ అభిమానులను ఉద్దేశించి చేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. డంకీ ప్రీమియర్ షోను హైదరాబాద్ లోని దేవీ థియేటర్లో ఉదయం 8 గంటలకు ప్రదర్శించారు. ఈ షోకి టికెట్లు బుక్ చేసుకున్న హైదరాబాద్ ఫ్యాన్స్ క్లబ్స్ చేసిన ట్వీట్ కు ప్రతిస్పందనగా షారుఖ్ 'వావ్ హైదరాబాద్! ఫస్ట్ డే ఫస్ట్ షో చూసి ఎంజాయ్ చేయండి. మూవీపై మీరేం



చెబుతారోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నా' అని ట్వీట్ చేశాడు.


## రిపోర్టర్లు కావలెను

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక

తెలుగు లో రాయగల సమర్థత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక

అన్నీ జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.

వివరాల కొరకు సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్ లు

email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/

91 90525 22626
91 98485 99616



Published and Printed by Vulloju Srinivas on Behalf of Sri Veena Publications Printed at Telangana Veena Flat N0: 204 Mythri Apartments,Opp Bsnl Office Ecil,Kapra,Med Responsible for Selection of News Under the PRB ACT, Phone number: 040 35668720,RNI Reg N0.TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written